ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 17.11.2026 | సంపుటి:13 సంచిక:117 | పేజీలు:12 వెల:రూ.4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





పరీక్ష ముగిసిన 3 వారాల్లోపే తుది ఫలితాలు

టీజీపీఎస్సీ నియామకాల్లో కొత్త సంస్కరణలు

హైదరాబాద్(జనంసాక్షి): టీజీపీఎస్సీ నియామక ప్రక్రియలో కొత్త సంస్కరణలను అమలు చేస్తోంది. కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలు ముగిసిన మూడు వారాల్లోపే తుది ఫలితాలను విడుదల చేస్తోంది. నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి తుది నియామకాలు పూర్తయ్యే వరకు మొత్తం నియామక ప్రక్రియను

మిగతా 2లో..



వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సిందే

హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి చుక్కెదురు

హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది.

మిగతా 2లో..

అసత్య ప్రచారాలకు తన ఆత్మకథతో
సోనియా గాంధీ అక్షర సమాధానం



ఇన్నాళ్లూ ఇతరులు మా కుటుంబ కథ చెప్పారు.. ఇప్పుడు నా వంతు

ఇందిరా,రాజీవ్ నుంచి రాహుల్, ప్రియాంక వరకుఎన్నో అనుభవాలకు అక్షరరూపం

- వ్యక్తిగత జీవితం, కుటుంబ అనుబంధాలు, రాజకీయ పరిణామాలపై మనసు విప్పిన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ
- ఢిల్లీలో ఇండియా కూటమి అగ్రనేతల సమక్షంలో 544 పేజీల 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథ పుస్తకావిష్కరణ



నా కుటుంబం, నా అత్త గారు, నా భర్త, నా కుమారుడు, నా కుమార్తె, ఇంకా నా గురించి బయట ఎన్నో విషయాలు చెబుతుంటారు. అందులో చాలా వరకు వాస్తవానికి చాలా దూరంగా ఉంటాయి. మా నిజ జీవితాలకు, ఆ కథనాలకు ఏ మాత్రం సంబంధం కూడా ఉండదు. రాజకీయాల్లో ఉన్న నా సహచరులు, మిత్రులు కూడా ఇలాంటి అనుభవాలను ఎన్నో ఎదుర్కొని ఉంటారు. బాధ కలిగించే ఎన్నో అసత్యాలను మా చుట్టూ కూడా అల్లారు. అందుకే నా భావాలను, నా కుటుంబాన్ని నేను అర్థం చేసుకున్న తీరును ప్రజల ముందుంచడానికి ఈ పుస్తకం రాయడమే సరైన మార్గమని భావించాను. నా కథను కూడా వినడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారని ఆశిస్తున్నాను." - సోనియా గాంధీ,

తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ..

కార్యక్రమంలో సోనియా గాంధీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2లో..

సీఈసీని ప్రశ్నించేందుకు అనుమతివ్వండి

సుప్రీంను కోరిన రాహుల్,ఇతర విపక్ష నేతలు






న్యూఢిల్లీ(జనంసాక్షి): 'సర్' ప్రక్రియకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే విధానంపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతించాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతక విపక్ష నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించి 48 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సమర్పించారు. దేశవ్యాప్త 'సర్'కు సంబంధించిన నిర్ణయాలను ఈసీ కలసికట్టుగా తీసుకుందా? లేదా ఇతర ఎన్నికల కమిషనర్ల అంగీకారం లేకుండానే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఈసీ అధికారాలను వినియోగించారా? అని ప్రశ్నించారు.'సర్' ఆథరైజేషన్, ఓటర్ల తొలగింపు ఆరోపణలు, ఈసీ ఆన్‌లైన్ ఎలక్టోరల్ నమోదు వ్యవస్థల్లో మార్పులకు సంబంధించిన అంశాలపై.. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నుంచి సమాధానాలను కోరారు. దేశవ్యాప్త సర్ ప్రక్రియకు అధికారం ఇస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం రికార్డుగా లేకపోవడం, ఆన్‌లైన్ ఫారం-6లో చేసిన మార్పులు, ఈసీఐనెట్, ఈఆర్‌వోనెట్ ఓటర్ల జాబితా డేటాబేస్‌ల పనితీరుపై

మిగతా 2లో..

తెలంగాణ పల్లెలకు ఇంటింటికీ ఇంటర్నెట్

కేంద్రం, టి-ఫైబర్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం





2లో..

తనఖా పెట్టిన ఇళ్ల పట్టాలు వెనక్కివ్వండి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మందికి ప్రయోజనం : మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి): ఉమ్మడి రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకాల లబ్ధిదారులు తనఖా పెట్టిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం తో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు గృహ నిర్మాణ పథకంలో ప్రభుత్వ సబ్సిడీ, లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణం ద్వారా నిధులు సమకూర్చేవారు. రుణాల కోసం లబ్ధిదారులు ఇళ్ల పట్టాలను తనఖా పెట్టేవారు. రుణ వాయిదాలన్నీ చెల్లించిన తర్వాత పట్టాలు తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. వివిధ కారణాలతో లక్షలాది మంది లబ్ధిదారుల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు తహసీల్దారు కార్యాలయాల్లోనే

మిగతా 2లో..

రక్షణ ల్యాబ్స్‌లోని సమాచార సేకరణకే హనీట్రాప్‌లు

ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ(జనంసాక్షి): మిలిటరీ, పరిశోధక నెట్‌వర్క్‌లను విదేశీ గూఢచర్యం నుంచి రక్షించుకొనేందుకు ఉన్నత స్థాయి చర్యలు చేపట్టినట్లు భారత వాయుసేన నూతన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ పేర్కొన్నారు. విదేశీ గూఢచర్య సంస్థలు హనీ ట్రాప్‌లతోపాటు.. ఇతర సైబర్ యుద్ధతంత్రాలను కూడా వాడుతున్నాయన్నారు. మొత్తం ఇంటెలిజెన్స్‌లో వలపు వలలు ఓ చిన్న భాగం మాత్రమే అని అభివర్ణించారు. వాస్తవానికి పబ్లిక్, ప్రైవేట్ రంగంలోని రక్షణ ల్యాబ్‌ల్లోని వ్యక్తులను

మిగతా 2లో..



బిల్కిస్‌భాను హత్యకేసు నిందితులకు జీవితఖైదు రద్దు

షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో సామూహిక అత్యాచార కేసులో ఇద్దరు దోషులకు విధించిన జీవితఖైదును సుప్రీంకోర్టు నిలిపివేసింది. వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో దోషులైన బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ రామన్‌లాల్ 17 ఏళ్లకుపైగా జైల్లో ఉన్నారని.. వారిలో ఒకరు తీవ్రమైన శారీరక వైకల్యంతో బాధపడుతున్నారని కోర్టు ఈ

మిగతా 2లో..



విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- ఎల్‌నినో ప్రభావం, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా సమర్థంగా విద్యుత్ నిర్వహణ
- రబీ సీజన్‌లోనూ రైతులు, అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి
- విద్యుత్తు ఉన్నత అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ డిమాండ్ చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకున్నా, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్ సంస్థలు సమర్థంగా పనిచేస్తున్నాయని అభినందించారు. రానున్న రబీ సీజన్‌లోనూ ఇదే పనితీరును కొనసాగిస్తూ రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్‌లో ఇంధన శాఖ ఉన్నతాది, కారులు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా నిర్వహణ, మౌలిక సదుపాయాల విస్తరణ, రానున్న రబీ సీజన్‌కు విద్యుత్ సంస్థల సన్నద్ధతపై చర్చించారు.అక్టోబర్ 16న రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు చేరుకుని చారిత్రాత్మక గరిష్ఠ స్థాయిని నమోదు చేసిందని తెలిపారు. వరుసగా రెండో రోజు కూడా 20,003 మెగావాట్ల స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ, విద్యుత్ సంస్థలు సమర్థంగా సరఫరా చేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏటా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, గత ఏడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్ ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు చేరిందని వివరించారు. ఇందులో ఎఱుఖఆఅఒ పరిధిలో 8,859 మెగావాట్లు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 3,595

మిగతా 2లో..



రోడ్డెక్కిన రేకుర్తి పరిసర ప్రాంతాల ప్రజలు

- 22-ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలని డిమాండ్
- వేలాది కుటుంబాలకు నిలిచిన భూముల క్రయవిక్రయాలు
- కలెక్టర్‌తో బాధితుల ప్రత్యేక సమావేశం
- త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ

కరీంనగర్‌లో భారీ ధర్నా

కరీంనగర్ బ్యూరో, జనంసాక్షి:
తమ సొంత భూములపై హక్కులు ఉన్నా.. వాటిని అమ్ముకోలేని పరిస్థితి. అవసరానికి తనఖా పెట్టి బ్యాంకు రుణం పొందలేని దుస్థితి. అధికారుల నిర్ణయంతో ఏళ్ల తరబడి తమ ఆధీనంలో ఉన్న పట్టా భూములు 22-ఏ నిషేధిత జాబితాలో చేరడంతో కరీంనగర్‌లోని రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి, సీతారాంపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిగతా 2లో..

తీవ్ర వాయుగుండంగా 'అక్వాన్'

- గంటకు 8 కి.మీ వేగంతో కదులుతున్న తుపాను
- ఏపీ-ఒడిశా మధ్య తీరం దాటే అవకాశం
- తెలంగాణలో భారీ వర్షాలకు అవకాశం

అమరావతి(జనంసాక్షి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కాంఅమరావతి:ణంగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 19న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ మేరకు ఆయా

మిగతా 2లో..





వరల్డ్ టాప్-200 వర్సిటీల్లో ఐఐటీ దిల్లీ

'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టెనబులిటీ ర్యాంకింగ్స్ 194వ స్థానంలో ప్రఖ్యాత విద్యాసంస్థ

న్యూఢిల్లీ(జనంసాక్షి): అంతర్జాతీయ స్థాయిలో ప్రకటించిన 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టెనబులిటీ ర్యాంకింగ్స్ 2027' జాబితాలో భారతీయ విద్యాసంస్థలు సత్తా చాటాయి. ఈ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) దిల్లీ భారతదేశంలో అగ్రస్థానంలో నిలవగా ప్రపంచవ్యాప్తంగా 194వ ర్యాంకు సాధించి టాప్- 200లో చోటు సంపాదించింది. మరోవైపు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం మళ్లీ వరల్డ్ టాప్- 500 జాబితాలోకి ప్రవేశించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ భారతదేశంలో రెండో ర్యాంకు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా 224వ స్థానంలో నిలిచింది. దిల్లీ యూనివర్సిటీ ప్రపంచవ్యాప్తంగా 237వ స్థానంలో నిలిచింది. భారత్‌లో మూడో ఉత్తమ విద్యాసంస్థగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పర్యావరణ, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో, సుస్థిర భవిష్యత్తును నిర్మించడంలో ఎంత

మిగతా 2లో..

రష్యాపై డ్రోన్ల వర్షం

- భారీస్థాయిలో విరుచుకుపడిన ఉక్రెయిన్
- ఏకంగా 1,300కుపైగా డ్రోన్లను ప్రయోగం
- యుద్ధం మొదలైనప్పటి నుంచి
- కీవ్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడి ఇదే..

మాస్కో(జనంసాక్షి): రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకంగా 1,300కుపైగా డ్రోన్లను ప్రయోగించింది. 2022లో ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలు కీవ్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడి ఇదే కావడం గమనార్హం! అయితే, ప్రత్యర్థి ప్రయోగించిన డ్రోన్లలో చాలావాటిని తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని రష్యా రక్షణశాఖ తెలిపింది. యుద్ధం ముగింపు విషయంలో అమెరికా మధ్యవర్తిత్వంలో ఇటీవల రెండు దేశాల మధ్య

మిగతా 9లో..



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17.11.2026

పరీక్ష ముగిసిన 3 వారాల్లోపే తుది ఫలితాలు

గరిష్ఠంగా 6 నెలల్లోపు పూర్తి చేసేలా కమిషన్ ప్రణాళికాబద్ధంగా పని చేస్తోంది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత దరఖాస్తులు సమర్పించడానికి అభ్యర్థులకు ఒక నెల సమయం ఇస్తారు. పరీక్ష సన్నద్ధత కోసం రెండు నెలల సమయం కేటాయిస్తారు. పరీక్షా తేదీలను ప్రకటించిన 25 రోజుల్లోపు సీబీఆర్?టీ పరీక్షను నిర్వహిస్తారు.ఇప్పటికే తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), రోడ్లు భవనాల శాఖలో చేపట్టిన నియామకాలకు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేశారు. పీసీబీలో అసిస్టెంట్ సైంటిస్ట్ (ఎనలిస్ట్ గ్రేడ్-2) పోస్టుల కోసం గత నెల 24న సీబీఆర్?టీ పరీక్ష ముగిసింది. కేవలం మూడు వారాల్లోపే ప్రాథమిక కీ విడుదల చేసి, ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసి తుది ఎంపిక జాబితాను ప్రకటించారు. భవిష్యత్తులో నిర్వహించే అన్ని పరీక్షలకు ఇదే విధానాన్ని అనుసరిస్తామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.

ఎలాంటి వివాదాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు

ఒకే దశలో పరీక్షలు ఉండే నియామక ప్రక్రియలను మూడు నెలల్లోపు, రెండు దశల్లో పరీక్షలు ఉండే ప్రక్రియలను ఆరు నెలల్లోపు పూర్తి చేయాలనేది కమిషన్ లక్ష్యం. పరీక్ష ముగిసిన వెంటనే సమగ్రమైన ప్రాథమిక సమాధానాల కీని విడుదల చేస్తారు. ప్రక్రియలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. పరీక్షలు కంప్యూటర్ ఆధారితం కావడంతో ఫలితాలను ప్రకటించే ప్రక్రియ మరింత సులభతరం, వేగవంతం అయ్యింది.

విద్యుత్ డిమాండ్ పెరిగినా.. సరఫరాలో అంతరాయం ఉండొద్దు




మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైందన్నారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4,000 మెగావాట్ల కొరత ఏర్పడినప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో రైతులతో పాటు అన్ని వర్గాల వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడం అభినందనీయమన్నారు. ఇదే విధంగా రబీ సీజన్‌లోనూ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.మరోవైపు పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా, మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు వివరించారు. దావుద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వీటి ద్వారా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంతో పాటు సరఫరా నాణ్యత, విశ్వసనీయత మెరుగుపడుతుందని వెల్లడించారు.రబీ సీజన్‌లో దీర్ఘకాలిక పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నందున విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల సంభవించే పరిస్థితులను ముందుగానే అంచనా వేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. డిమాండ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, ఏ ఒక్క వర్గం వినియోగదారుడికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఎఊఖఆఅఒ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, డైరెక్టర్లు శివాజీ, చక్రపాణి, నరసింహ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బిల్కిస్‌భాను హత్యకేసు నిందితులకు జీవితఖైదు రద్దు

సందర్భంగా పేర్కొంది. వారిని వెంటనే విడుదల చేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.ఈ కేసులో తమకు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సమర్థిస్తూ బాంబే హైకోర్టు 2017లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దోషులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ శిక్షను నిలిపివేయాలని అభ్యర్థించారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. తాజాగా ఇద్దరు దోషులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. వారి అరెస్టుకు దారితీసిన పరిస్థితులు, సుదీర్ఘకాలం జైలులో గడిపిన కాలాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరించింది.కాగా.. 2022 ఆగస్టులో గుజరాత్ ప్రభుత్వం సత్ప్రవర్తన కారణం చూపి ఈ కేసులో 11 మంది దోషులను ముందస్తు విడుదల చేసిన సంగతి తెలిసిందే. వారిలో బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ రామన్‌లాల్ కూడా ఉన్నారు. అయితే దోషుల విడుదలపై అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ ఉత్తర్వులను పలువురు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దానిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. దోషులకు శిక్ష నుంచి ఉపశమనం కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని పేర్కొంటూ.. గుజరాత్ ప్రభుత్వ క్షమాభిక్ష ఉత్తర్వులను 2024 జనవరిలో కొట్టివేసింది. ఆ 11 మంది దోషులను తిరిగి జైల్లో పెట్టాలని ఆదేశించింది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరగ్గా.. మూడేళ్ల కుమార్తెతో సహా ఆమె కుటుంబంలోని ఏడుగురు హత్యకు గురైన సంగతి తెలిసిందే.

అసత్య ప్రచారాలకు ఆత్మకథతో సోనియా గాంధీ అక్షర సమాధానం





న్యూఢిల్లీ(జనంసాక్షి):తన కుటుంబంపై దశాబ్దాలుగా సాగుతున్న అసత్య ప్రచారాలకు, కల్పిత కథనాలకు అక్షరాలతో సమాధానం చెప్పేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ సిద్ధమయ్యారు. తన జీవితాన్ని, కుటుంబాన్ని దగ్గరగా తెలుసుకోని వారు సైతం ఎన్నో కథనాలు సృష్టించారని, వాటిలో చాలా వరకు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీ, కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు తన వ్యక్తిగత జీవితంపైనా అనేక అసత్యాలు ప్రచారంలోకి వచ్చాయని పేర్కొన్నారు. ఇన్నాళ్లూ ఇతరులు తమ కుటుంబ కథను తమదైన కోణంలో చెప్పారని, ఇప్పుడు తనకు తెలిసిన వాస్తవాలను ప్రజల ముందుంచాలనే ఉద్దేశంతో ఆత్మకథ రాసినట్లు స్పష్టం చేశారు. సోమవారం దిల్లీలో జరిగిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.దిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. ఇండియా కూటమికి చెందిన పలువురు ప్రముఖ నాయకులు కూడా పాల్గొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, ఎన్సీపీ నేత సుప్రియా సూలే తదితరులు హాజరయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.ఇటలీ నుంచి భారత రాజకీయాల వరకు..సోనియా గాంధీ వ్యక్తిగత జీవన ప్రయాణంతో పాటు భారత రాజకీయాల్లో కీలక పరిణామాలకు ఈ ఆత్మకథ అద్దం పడుతుంది. ఇటలీలో గడిచిన బాల్యం, ఇంగ్లండ్‌లో చదువుకునే సమయంలో రాజీవ్ గాంధీతో ఏర్పడిన పరిచయం, ప్రేమ, వివాహం అనంతరం భారతదేశానికి రావడం వంటి ఆసక్తికరమైన విషయాలను ఇందులో పొందుపరిచారు. నెహ్రూ-గాంధీ కుటుంబంలోకి అడుగుపెట్టిన తొలినాళ్ల అనుభవాలు, భారతీయ జీవన విధానానికి అలవాటు పడటం, హిందీ నేర్చుకోవడం, ఇందిరా గాంధీతో ఏర్పడిన అనుబంధాన్ని వివరించారు.జీవితాన్ని మార్చిన విషాదాలు.. రాజకీయ బాధ్యతలుఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టడం, 1991లో ఆయన హత్యతో తన జీవితంలో ఎదురైన తీవ్ర విషాదాన్ని కూడా సోనియా ప్రస్తావించారు. భర్త మరణం తర్వాత రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించడం, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు స్వీకరించి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం వంటి పరిణామాలను తన అనుభవాల కోణంలో వివరించారు. కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో ముందుండి నడిపించడం, పార్టీ పునరుద్ధరణకు చేసిన ప్రయత్నాలు కూడా ఈ రచనలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ప్రధాని పదవిని తిరస్కరించిన నిర్ణయం..2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ విజయం సాధించిన తర్వాత ప్రధానమంత్రి పదవిని చేపట్టకుండా డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అవకాశం కల్పించిన నిర్ణయం వెనుక ఉన్న పరిస్థితులు కూడా ఈ ఆత్మకథలో చోటుచేసుకున్నాయి. అధికార రాజకీయాలకు అతీతంగా తీసుకున్న ఆ నిర్ణయం, అప్పటి రాజకీయ పరిణామాలు, తనపై వచ్చిన విమర్శలు తదితర అంశాలను పాఠకులకు వివరించే ప్రయత్నం చేశారు. బిలాంగింగ్' వెనుక భావం.. 544 పేజీలతో రూపొందిన ఈ పుస్తకాన్ని హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించింది. నవంబర్ 10 నుంచి పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. 'బిలాంగింగ్' అనే శీర్షిక ద్వారా తన జీవితంలో నవంబర్ 10 నుంచి పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. 'బిలాంగింగ్' అనే శీర్షిక ద్వారా తన జీవితంలోఎదురైన అంగీకారం, అనుబంధం, గుర్తింపు వంటి భావోద్వేగ అనుభవాలను కూడా సోనియా ఆవిష్కరించారు. ఒక కొత్త దేశానికి వచ్చి అక్కడి కుటుంబంలో భాగం కావడం, నిరంతరం ప్రజల పరిశీలనలో ఉండటం, వ్యక్తిగత జీవితానికి కూడా రాజకీయ రంగు పులమబడటం వంటి అనుభవాలు ఈ రచనలో ప్రతిబింబించాయి.కుటుంబం, ప్రేమ, అనుబంధం, నష్టం, బాధ్యత, రాజకీయ ప్రయాణం.. ఇలా అనేక కోణాలను కలగలిపిన ఈ ఆత్మకథ కేవలం వ్యక్తిగత జీవిత కథ మాత్రమే కాకుండా, భారత రాజకీయాల్లో కీలక ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన ఒక మహిళ అనుభవాల సమాహారంగా నిలుస్తోంది. తన కుటుంబంపై ప్రచారంలో ఉన్న కథనాలకు తనదైన వివరణ ఇవ్వడంతో పాటు, చరిత్రలో తమ కుటుంబ పాత్రను తన దృష్టికోణంలో భవిష్యత్ తరాలకు అందించాలన్న ప్రయత్నంగా ఈ పుస్తకం ప్రాధాన్యం సంతరించుకుంది.

సీఈసీని ప్రశ్నించేందుకు అనుమతివ్వండి

కూడా రాహుల్ గాంధీ ఇతర నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ డేటాబేస్‌లు కేంద్రీకృతంగా ఉన్నాయని, పారదర్శకంగా లేవని ఆరోపించారు. ఈసీ పోర్టల్‌లో చేసిన అప్‌డేట్‌లు, మార్పుల వివరాలను, వాటిని అమలు చేసిన వారి సమాచారాన్ని కోరారు. 'సర్'కు సంబంధించి తమ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవేనని ఈసీ ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిని చట్ట ప్రకారమే అమలు చేశామని పేర్కొంది. అదేవిధంగా ఫారం-6ను తాము సవరించలేదనీ తెలిపింది. ఇదిలా ఉండగా.. 'సర్' విషయంలో సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని.. ఇష్టానుసారం ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ సహా 12 మంది విపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్లు ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై ఈనెల 17న మరోసారి విచారణ జరపనుంది.

విద్యార్థులపై ట్రంప్ గురి..

అమెరికా యూనివర్సిటీలకూ సెగ

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో ట్రంప్ కార్యవర్గం చేపట్టిన చర్యలు విదేశీ విద్యార్థులకే కాకుండా.. అక్కడి విశ్వవిద్యాలయాలకూ తలనొప్పిగా మారాయి. ఉన్నత విద్య కోసం అమెరికా వెళుతున్న భారత్ చైనీయుల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది. 2025-26 సీజన్‌లో అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య 6% తగ్గి 3,39,435గా నమోదైంది. ఇక చైనీయుల సంఖ్య 4% తగ్గి 2,54,458గా ఉంది. ఇదే సమయంలో మొత్తంగా అగ్రరాజ్యానికి వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 18% పడిపోయింది. అయితే బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్థాన్, ఇటలీ వంటి దేశాల నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్య మాత్రం గణనీయంగా పెరగడం గమనార్హం.అమెరికాలో విదేశీయులకు ఉద్యోగాలు తగ్గిపోవడం, ఆ దేశ వలస విధానాల్లో భారీ మార్పులు వంటి అంశాలతో విద్యార్థులు కూడా అగ్రరాజ్యానికి వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు. 2026లో గ్రాడ్యుయేషన్‌లో చేరే వారి సంఖ్యలో 15శాతం, అండర్ గ్రాడ్యుయేషన్‌లో చేరేవారి సంఖ్యలో 3శాతం తగ్గుదల కనిపించింది. ఓపెన్ డోర్స్ సంస్థ అంచనాల ప్రకారం.. ఉన్నత విద్య చేరికలు భారీగా తగ్గినట్లు తెలిసింది. ట్రంప్ పాలసీల ఎఫెక్ట్ ఇంకా పూర్తిగా పడలేదని ఈ సంస్థ పేర్కొంది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ లెక్కల ప్రకారం అగ్రరాజ్య విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థులు చేరడం వల్ల ఏటా 57 బిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తోంది. ఈ విద్యార్థులు ట్యూషన్ ఫీజు రూపంలో వీటిని చెల్లిస్తున్నారు. ఇక వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం ఆ దేశంలో వెచ్చించే మొత్తం అదనం. అంతేకాదు.. కంపెనీలు, విశ్వవిద్యాలయాలకు అవసరమైన ప్రతిభావంతుల్లో చాలా మంది ఈ మార్గంలో అమెరికాకు వచ్చేవారే కావడం గమనార్హం.మరోవైపు అమెరికాలోని విశ్వవిద్యాలయాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తగ్గిన ఆదాయం కవర్ చేసుకోవడానికి కోర్సుల మూసివేత, ఉద్యోగులకు లేఆఫ్‌లు వంటివి చేపడుతున్నాయి. నార్త్ టెక్సాస్ విశ్వవిద్యాలయం 70 అకడమిక్ ప్రోగ్రాముల రద్దు/విలీనం చేసింది. అంతర్జాతీయ విద్యార్థుల తగ్గుదలే దీనికి కారణమని పేర్కొంది.

రక్షణ ల్యాబ్స్‌లోని సమాచార సేకరణకే హనీట్రాప్‌లు

టార్గెట్ చేసుకోవడానికి దీనిని వాడుతున్నట్లు వెల్లడించారు.సైనిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను పబ్లిక్ ఇంటర్నెట్‌కు దూరంగా ఉంచడంతో విదేశీ ఇంటెలిజెన్స్ వర్గాలు వ్యక్తులను ట్రాప్ చేస్తున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ దీక్షిత్ వెల్లడించారు. ప్రైవేట్ రక్షణ సంస్థలు తమ ఉద్యోగులకు శిక్షణ సమయం నుంచే వీటిపై అవగాహన కల్పించాలన్నారు. ఇక నిజమైన ఆత్మనిర్భరత పారిశ్రామికోత్పత్తితో పాటు.. నేరుగా ఆయుధ సన్నద్ధతతో ముడిపడి ఉంటుందన్నారు. ఏదైనా యుద్ధం తలెత్తితే సోర్సుకోడ్‌లు, టెక్నాలజీ, విడిభాగాలు, మందుగుండు కోసం ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదన్నారు. భవిష్యత్తులో సైబర్, ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ వంటివి యుద్ధక్షేత్రాలుగా మారతాయన్నారు.మరోవైపు చైనాపై నిశితంగా నిఘా ఉంచినట్లు ఐఏఎఫ్ చీఫ్ వెల్లడించారు. అటు నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైమానిక సామర్థ్యం పెంచేలా కొత్త ప్రణాళికలు జోడిస్తున్నామన్నారు.

రోడ్డెక్కిన రేకుర్తి ఏరిసర ప్రాంతాల ప్రజలు



తమ భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బాధితులు ఆందోళన బాట పట్టారు. కరీంనగర్‌లో భారీ ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు.సుమారు 6 వేల ఎకరాల పట్టా భూములు, ఇళ్ల స్థలాలు నిషేధిత జాబితాలో చేరడంతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దశాబ్దాలుగా తమ ఆధీనంలో ఉన్న భూములను ఎలాంటి ముందస్తు నోటీసులు, సమాచారం లేకుండా 22-ఏ జాబితాలో చేర్చడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పాటు బ్యాంకు రుణాలు పొందే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కలెక్టర్ భరోసా.. త్వంలో శాశ్వత పరిష్కారంఈ సమస్యపై బాధితులు పలుమార్లు నిరసనలు చేపట్టడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల పొరపాట్ల కారణంగా ప్రైవేటు పట్టా భూములు నిషేధిత జాబితాలో చేరితే వాటిని తొలగిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించకపోవడంతో బాధితుల్లో ఆందోళన కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో నవంబర్ 16, 2026న కరీంనగర్ జిల్లా కలెక్టర్ రేకుర్తి 22-ఏ బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాధితుల సమస్యలను, వారి అభ్యంతరాలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే సీసీఎల్‌ఏకు నివేదిక పంపినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని, బాధితులకు న్యాయం జరిగేలా త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ హామీతో బాధితుల్లో కొంత ఆశాభావం వ్యక్తమవుతున్నప్పటికీ, తమ పట్టా భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సిందే

వీణవంకలో నమోదైన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కరీంనగర్ సీపీని దూషించారనే ఫిర్యాదుతో వీణవంక పీఎస్‌లో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులో వాయిస్ శాంపిల్ ఇవ్వాలని ఆయనకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీనిపై కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు వాయిస్ శాంపిల్స్ సేకరిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనల అనంతరం కౌశిక్‌రెడ్డి పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

తీవ్ర వాయుగుండంగా 'అక్వాన్'

జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. తుపాను ప్రభావంతో ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురవొచ్చని తెలిపింది. ఇటీవల అర్నబ్, మురసు తుపాన్లతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. తాజాగా బంగాళాఖాతంలో మరో తుపాను బలపడుతోందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఏపీలోని మచిలీపట్నం- ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య ఎక్కడైనా ఈ తుపాను తీరం దాటొచ్చని, దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉందని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. తుపాను వల్ల రాష్ట్రంలో 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఇవాళ తుపానుగా మారనుందని వాతావరణ శాఖ పేర్కొంది. దీనికి 'అక్వాన్'గా ఇరాన్? పేరు పెట్టింది. ఈ పదానికి రాక్షస శక్తి అని అర్థం. ఆదివారం ఉదయం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అక్కడే కేంద్రీకృతమైంది. ఆదివారం సాయంత్రానికి ఇది గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా పయనించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఇది ట్రింకోమాలికి 620 కి.మీ., చెన్నైకి 800, విశాఖపట్నానికి 960 కి.మీ. దూరంలో ఉందని ఐఎండీ వివరించింది. ఇవాళ వాయుగుండం మరింత బలపడనుందని, దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

వరల్డ్ టాప్-200 వర్సిటీల్లో ఐఐటీ దిల్లీ

సమర్థంగా పనిచేస్తున్నాయో ఈ సస్టైనబులిటీ ర్యాంకింగ్స్ ద్వారా ప్రకటిస్తారు.ఈ ఏడాది క్యూఎస్ (క్వాక్వారెల్లీ సైమండ్స్) సస్టైనబులిటీ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి మొత్తం 99 విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకున్నాయి. అయితే గతేడాది ఉన్న 103 ఎంట్రీలతో పోలిస్తే ఈ సంఖ్య తగ్గిందని చెప్పొచ్చు. ఇక ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో అత్యధిక ప్రాతినిధ్యం ఉన్న మొదటి ఐదు ఉన్నత విద్యా వ్యవస్థలలో ఎక్కువ పురోగతి కనబరిచిన దేశంగా భారత్ నిలిచింది. ర్యాంకింగ్స్‌లో అత్యధికంగా అమెరికా నుంచి 214 యూనివర్సిటీలు ఎంట్రీ సాధించగా, చైనా నుంచి 149, యూకే నుంచి 105 విద్యాసంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా టాప్ - 1000 యూనివర్సిటీల జాబితాలో భారత్ నుంచి 42 విద్యా సంస్థలు ఉన్నాయి. ఇక్కడ భారత్, చైనాతో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచింది. అమెరికా (128), బ్రిటన్ (84) మాత్రమే భారత్ కంటే ముందున్నాయి.

8 కొత్త విద్యాసంస్థలు- మెరుగైన ర్యాంకులు

భారతదేశం నుంచి ఈసారి క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ జాబితాలో 8 కొత్త విద్యా సంస్థలు ప్రవేశించాయి. ఇంకా కిందటేడాది ర్యాంకులు పొందిన వాటిల్లో 38 సంస్థలు తమ ర్యాంకుల్ని మరింత మెరుగుపర్చుకున్నాయి. 19 సంస్థల ర్యాంకింగ్స్ యథాతథంగా ఉన్నాయి. 34 సంస్థల ర్యాంకులు గతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. 2023 తర్వాత తొలిసారిగా జేఎన్‌యూ తిరిగి ప్రపంచ టాప్- 500 యూనివర్సిటీల జాబితాలోకి ప్రవేశించడం విశేషం. వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎఐ) తొలిసారిగా టాప్- 300 యూనివర్సిటీల జాబితాలోకి, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ టాప్- 400 లిస్టులోకి అడుగుపెట్టాయి. చండీగఢ్ యూనివర్సిటీ, సవీత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ తొలిసారి టాప్- 600 లోకి ప్రవేశించాయి.

తెలంగాణ పల్లెలకు ఇంటింటికీ ఇంటర్నెట్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించేందుకు 'భారత్‌నెట్' ప్రాజెక్టును వేగవంతం చేసింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3,185 కోట్లు మంజూరు చేసింది.గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు పడింది. సవరించిన 'భారత్‌నెట్' పథకం కింద, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ భారత్ నిధి, టి-ఫైబర్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించడంతో ప్రతి గ్రామీణ కుటుంబానికి హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే కల సాకారానికి మరింత దగ్గరైంది. ఈ కార్యక్రమం ఇప్పటికే పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్?లో అందుబాటులోకి తెచ్చిన ఏఐ ల్యాబ్ సేవలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఈ కొత్త ఒప్పందంతో గతంలో టీ-ఫైబర్‌కు ఎదుర్కొన్న నిధుల కొరత సమస్య పరిష్కారమైంది.

నిధుల కొరతకు తీరిన పరిష్కారం

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ పథకాన్ని ప్రారంభించింది. టీ ఫైబర్ ద్వారా గ్రామాల్లో డక్ట్ వైర్? ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించడమే దీని లక్ష్యం. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 1,179 గ్రామ పంచాయతీలు, 482 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు కూడా టీ ఫైబర్ కనెక్షన్లను విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 3,185 కోట్ల నిధులను కేటాయించడానికి ఆమోదం తెలపడంతో సేవల విస్తరణకు అడ్డుగా ఉన్న ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి.

సరసమైన ధరకే సేవలు

ఇంటర్నెట్ కనెక్షన్ అవసరమైన రూటర్స్, కేబుళ్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులకు సరసమైన ధరకే హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుతాయి. ఇళ్లలో కంప్యూటర్లు, టెలివిజన్ల కోసం 4జీ, 5జీ నెట్‌వర్క్ సౌకర్యం లభిస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఫైబర్ పైపులు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం గ్ర

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

పులి పంజాకు మూడు ఆవు దూడలు బలి

□ అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు : ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ హెచ్చరిక



సిర్పూర్ టి, నవంబర్ 16 (జనంసాక్షి) : సిర్పూర్ అటవీ రేంజ్ పరిధిలోని మాకిడి సెక్షన్ అటవీ ప్రాంతంలో పులి దాడి చేయడంతో మూడు ఆవు దూడలు మృతి చెందాయి. ఆదివారం మేత కోసం అడవిలోకి వెళ్లిన పశువుల మందపై పులి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ ఘటనలో చీలపల్లి గ్రామానికి చెందిన పవార్ సచిన్, చహకటి పాలకరావు లతో పాటు దుబ్బగూడ గ్రామానికి చెందిన చౌదరి నానాజీలకు చెందిన ఆవు దూడలు చనిపోయాయి. ఈ విషయాన్ని సిర్పూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ధృవీకరించారు. పులి సంచారం ఉన్నందున గ్రామస్థులు ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని ఆయన సూచించారు. అడవి సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకునే రైతులు, కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వన్యప్రాణుల దాడిలో పశువులను కోల్పోయిన బాధిత రైతులకు అటవీ శాఖ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని ఎఫ్ఆర్ఓ స్పష్టం చేశారు. ప్రజలు ఎవరూ వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దని, పులి జాడ కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఇ-20 పెట్రోల్‌తో ఇంజిన్లకు ముప్పు?

□ మైలేజ్ తగ్గుదలపై వాహనదారుల ఆందోళన

□ పాత వాహనాల పరిస్థితి ఏమిటి?



కొటాల నవంబర్ 16 (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియోగం అమల్లోకి రావడంతో వాహనదారుల్లో ఆందోళన మొదలైంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ కలిపి విక్రయిస్తున్న నేపథ్యంలో ఈ ఇంధనం వాహనాల ఇంజిన్లపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే చర్చ సాగుతోంది. అన్ని పెట్రోల్ బంకుల్లో ఇ20పెట్రోల్ నే వాడుతున్నారు. దాంతో ముఖ్యంగా పాత బైకులు, కార్లు వినియోగిస్తున్న వాహనదారులు తమ వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మైలేజ్ తగ్గుతుందా?

సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే ఈ 20లో ఇంధన శక్తి కొంత తక్కువగా ఉండటంతో వాహనాల మైలేజ్ తగ్గే అవకాశం ఉంది. వాహనం మోడల్, ఇంజిన్ సాంకేతికత, నిర్వహణ పరిస్థితులను బట్టి ఈ ప్రభావం మారుతుంది. కొన్ని వాహనాల్లో ఇంధన వ్యవస్థకు సంబంధించిన సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

పాత వాహనాలపై ప్రభావం ఉంటుందా?

ఈ20కు అనుకూలంగా రూపొందించని పాత వాహనాల్లో రబ్బర్ పైపులు, సీల్స్, ఇంధన వ్యవస్థలోని కొన్ని భాగాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే ఈ20 పెట్రోల్ వాడినంత మాత్రాన అన్ని వాహనాల ఇంజిన్లు పాడవుతాయని చెప్పడానికి ఆధారాలు లేవు. ఇ20 అనుకూల వాహనాల్లో సాధారణంగా పెద్ద సమస్యలు ఉండవు.

వాహనదారులు ఏం చేయాలి?

వాహనదారులు తమ వాహనం ఇ 20కు అనుకూలమా కాదా అనేది తయారీ సంస్థ సూచనలు, యజమాని పుస్తకం ద్వారా తెలుసుకోవాలి. అనుమానం ఉంటే అధీకృత సర్వీస్ సెంటర్‌ను సంప్రదించాలి. మైలేజ్ తగ్గడం, ఇంజిన్ పనితీరులో మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తనిఖీ చేయించుకోవాలి. మొత్తానికి ఇ 20 పెట్రోల్ వినియోగంపై వాహనదారుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, చమురు సంస్థలపై ఉంది. పాత వాహనాల యజమానులకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వీల్‌చైర్‌లో ప్రజావాణికి.. మూడు చక్రాల బండి కోసం వేడుకోలు..

□ కదలలేని స్థితిలోనూ కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): శారీరక వైకల్యం అతడి కదలికలను కట్టడి చేసింది.. అయినా తన అవసరాన్ని అధికారులకు చెప్పుకోవాలన్న ఆశను మాత్రం ఆపలేకపోయింది. మహాముత్తారం మండలానికి చెందిన జాడి రాజయ్య అనే దివ్యాంగుడు నడవలేని స్థితిలో వీల్‌చైర్‌లో కూర్చొని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చాడు. దివ్యాంగులకు ప్రభుత్వం అందించే మూడు చక్రాల బండి (ట్రై సైకిల్) తనకు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటూ వినతిపత్రం సమర్పించాడు. సోమవారం భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వీల్‌చైర్‌లో వచ్చిన ఈ దివ్యాంగుడు తన అవసరాన్ని అధికారులకు వివరించాడు. రోజువారీ పనుల కోసం, ఇతరులపై ఆధారపడకుండా తనంతట తాను కదలడానికి మూడు చక్రాల బండి ఎంతో ఉపయోగపడుతుందని, దానిని మంజూరు చేసి ఆదుకోవాలని కోరాడు. వీల్‌చైర్‌లో కూర్చొని వినతిపత్రం అందజేస్తున్న ఆయనను చూసిన పలువురు చలించిపోయారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందించే సహాయ పరికరాలు వారి జీవితాల్లో ఎంతో మార్పు తీసుకువస్తాయి. ముఖ్యంగా మూడు చక్రాల బండి అందితే రాకపోకలకు ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం కొంతవరకు తగ్గుతుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుంది. అలాంటి చిన్న సహాయం ఒక దివ్యాంగుడి జీవితంలో పెద్ద మార్పునకు కారణమవుతుంది. అతడి పరిస్థితిని మానవీయ కోణంలో పరిశీలించి, అర్హత మేరకు మూడు చక్రాల బండిని మంజూరు చేయాలని సంబంధిత అధికారులను పలువురు కోరుతున్నారు. ప్రజావాణిలో సమర్పించిన ఈ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించి అతడి ఆశను నెరవేరుస్తారో లేదో వేచి చూడాలి.

భూముల సర్వేలో వేగం పెంచాలి

□ కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16(జనంసాక్షి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లాల వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి 6 మండలాల సర్వేయర్లకు సర్వే కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వేలో ఓవర్లు, ఇతర పరికరాల సహాయంతో భూముల సర్వే నిర్వహించడంతో సర్వే ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, సాంకేతికత వినియోగంతో ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. భవిష్యత్తులో భూ వివాదాలు లేకుండా రికార్డులను పకడ్బందీగా నిర్వహించవచ్చని, రెవెన్యూ సిబ్బంది పరికరాలు ఉపయోగించే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. వినయ్ కుమార్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు షేక్‌పేట్ క్రీడాకారులు

రాజేంద్రనగర్,నవంబర్16(జనంసాక్షి) : గోల్కొండ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన 10వ ఎలైట్ మెన్ అండ్ ఉమెన్స్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో షేక్‌పేట్ బాక్సింగ్ క్లబ్‌కు చెందిన ఐదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కె పవన్ కళ్యాణ్ బెస్ట్ బాక్సర్ అవార్డు అందుకున్నారు. ఎంపికైన వారిలో పి. ద్వారకేష్ బాబు, దేవి వరప్రసాద్, మాహి వజీర్, హరిప్రియ ఉన్నారు. డిసెంబర్‌లో పురుషుల పోటీలు బీహార్‌లో, మహిళల పోటీలు మహారాష్ట్రలో జరగనున్నాయి. ఈ సందర్భంగా విజేతలను కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్ అభినందించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వినేష్ బాబు, కోచ్‌లు బి. శివకుమార్, సన్నీ, ప్రదీప్, ప్రభు సింగ్, యాదయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

దీక్షా దివస్ సందర్భంగా దక్షిణాఫ్రికాలో 14 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు


జోహన్నెస్‌బర్గ్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2009 నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా నిర్వహించే దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నాయకుడు మహేష్ బిగాల ఆదేశాల మేరకు దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ ఆధ్వర్యంలో 14 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ నాయకుడు నాగరాజు గుర్రాల మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్‌కు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను జాతీయ స్థాయిలో బలంగా వినిపించిందని తెలిపారు. ఆ దీక్ష స్ఫూర్తితో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు, ప్రజాసంఘాలు ఉద్యమంలో భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. దీక్షా దివస్ ప్రాధాన్యతను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసులకు, ముఖ్యంగా యువతకు, భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో 14 రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాగరాజు గుర్రాల తెలిపారు. దక్షిణాఫ్రికాలో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులందరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాగరాజు గుర్రాల పిలుపునిచ్చారు.

తాగునీటి ట్యాంక్‌లో చచ్చిన ఎలుకలు

□ పురుగులు పట్టిన నీరే తాగుతున్న తండావాసులు

□ రెండు నెలలుగా శుభ్రం చేయని మిషన్ భగీరథ ట్యాంక్

□ మెట్లు కూలిపోయి ఎక్కలేని దుస్థితి





రేవల్లి, నవంబర్ 16 (జనంసాక్షి) : రేవల్లి మండలంలోని పాత తండా గ్రామపంచాయతీ పరిధిలోని తల్పునూర్ తండాలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. తండావాసులకు తాగునీటిని సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ లో మూడు ఎలుకలు చనిపోయి, పురుగులు పట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. అదే కలుషిత నీరు తండావాసులకు తాగునీటికి సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేసి దాదాపు రెండు నెలలు పైన అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ట్యాంక్ లో ఎలుకలు చనిపోయి పురుగులు పడినా అదే నీటిని సరఫరా చేయడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ ట్యాంక్ లో చనిపోయిన ఎలుకలు

తండాలో గల ఈ వాటర్ ట్యాంక్ ను 15 సంవత్సరాల క్రితం నిర్మించారు. ట్యాంక్ పైకి ఎక్కడానికి ఉన్న మెట్లు పూర్తిగా కూలిపోయాయని, ట్యాంక్ పైకి ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటర్ ట్యాంక్ ఎక్కి శుభ్రం చేయడానికి గోవా తడకలు వేసుకొని కట్టెల సహాయంతో వాటర్ ట్యాంక్ పైకి ఎక్కాల్సి వస్తుందని దీంతో చాలా ప్రమాదం పొంచి ఉందని ప్రాణాలకే ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్ మెట్లు ఉన్నాయని వాటర్ మెన్ మైబుస్ తెలిపారు. మెట్లు లేకపోవడం వల్ల ట్యాంక్ శుభ్రం చేయడం, పరిశీలించడం కూడా కష్టంగా మారిందన్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ లో ఎలుకలు చనిపోయిన విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. తక్షణమే వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే వాటర్ ట్యాంక్ మెట్లు కూలిపోయిన విషయాన్ని ఉన్నతాధికారులకు పలుమార్లు తెలియజేశామని, వారి నుండి ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

□ కలెక్టరేట్‌లో మెగా ఆరోగ్య శిబిరం



రంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన చికిత్స అందించాలనే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కాంటినెంటల్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రారంభించారు. కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్య బృందం పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్పటికప్పుడు చొరవ చూపాలని సూచించారు.

నీటి సంరక్షణ పనులపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన



నిర్మల్ బ్యూరో. నవంబర్ 16,(జనంసాక్షి): నేషనల్ వాటర్ అవార్డ్స్‌లో భాగంగా జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి పనులను సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుడు డి. గణేష్ సోమవారం పరిశీలించారు. చిట్యాల, ముజ్గి, దిలావర్‌పూర్, మాడేగం, పొన్కల్ గ్రామాల్లో పర్యటించి వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణకు చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నీటి వృథాను అరికట్టి, వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ అవసరాలకు జలవనరులను సంరక్షించాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ పర్యటనలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా క్రీడలకు హనుమకొండ సిద్ధం

□ జేఎన్ఎస్ స్టేడియంలో పనులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

□ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 16 (జనం సాక్షి) : జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు హనుమకొండను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియాన్ని ఖేలో ఇండియా నోడల్ ఆఫీసర్ పవన్‌తో కలిసి సందర్శించి, కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై హనుమకొండ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంతను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జేఎన్ఎస్ స్టేడియంలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, సాంకేతిక బృందాలు ఈ పోటీలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా స్టేడియంలో మౌలిక సదుపాయాలు, క్రీడా వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పోటీల సందర్భంగా వైద్య బృందాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచడంతో పాటు పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జీడబ్ల్యూఎంసీ, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖతో పాటు క్రీడా శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి, ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

□ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్

□ పీసీపీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘిస్తే ప్రాసిక్యూషన్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16 (జనంసాక్షి) : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, అందుకు సహకరించినా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్‌ఏసీ) చైర్మన్ డాక్టర్ కె.ఆనంద్ హెచ్చరించారు. మేడ్చల్ జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సోమవారం ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టం-1994 నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నమోదు కాని ప్రైవేటు ఆరోగ్య సంస్థలు, అనధికారిక కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. గర్భస్థ శిశువు లింగాన్ని తెలుసుకోవడం, లింగ ఎంపిక చేయడం లేదా అందుకు సహకరించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎ సమావేశంలో అల్ట్రాసౌండ్, సోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, ఇమేజింగ్ కేంద్రాల ఏర్పాటుకు వచ్చిన కొత్త దరఖాస్తులను కమిటీ సమగ్రంగా పరిశీలించింది. సమావేశంలో అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, పీడియాట్రిషియన్ డాక్టర్ లింగమూర్తి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత, జన్యు నిపుణులు, జిల్లా ప్రజా సంబంధాల అధికారి స్వర్ణలత, ఎన్‌జీఓ ప్రతినిధి హైమావతి, డిప్యూటీ డెమో వసంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని ధర్నా



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఆశాలకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ-బీఆర్టీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ లక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సేవల్లో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్నా రూ.9,900 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఐదేళ్లుగా వేతన పెంపు లేదన్నారు. రూ.50 లక్షల బీమా, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్, సెలవులు కల్పించాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం పూర్తి చేసిన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు, నాయకులు చెన్నూరు రమేష్, గుర్రం దేవేందర్, రాజేందర్, మైస రజిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 నవంబర్ 2026

క్రూర మృగాలు జనారణ్యంలోకి

బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది. బిపిన్‌చంద్ర జోషి, ప్రదీప్ రామన్‌లాల్ అనే ఆ ఇద్దరూ 17 ఏళ్లకు పైగా జైల్లో ఉన్నారని, అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఒకరు తీవ్రమైన శారీరక వైకల్యంతో బాధపడుతున్నారని ధర్మాసనం పేర్కొంది. జీవిత ఖైదును తాత్కాలికంగా నిలిపివేసింది. చట్టపరంగా ఇది అప్పీళ్ల పరిధిలోని ఉపశమనం మాత్రమే. నేరారోపణలను కోర్టు రద్దు చేయలేదు. అయినా ఈ వార్త దేశ మనస్సాక్షిని మళ్ళీ కదిలించింది.

2002 మార్చి 3న ఛప్పర్వాడ్‌లో జరిగింది మనిషి ఊహకు అందని పైశాచికత్వం. ఐదు నెలల గర్భిణి అయిన పంతొమ్మిదేళ్ల బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె మూడేళ్ల కూతురిని రాళ్లకేసి కొట్టి చంపారు. కుటుంబంలోని పద్నాలుగు మంది ప్రాణాలు తీశారు. చనిపోయిందనుకుని వదిలేసి వెళ్లిన ఆ దుండగుల మధ్య నుంచి ఆమె ప్రాణాలతో బయటపడ్డారు. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు పైగా సాగిన పోరాటం ఒక మహిళ ధైర్యానికి, నిలకడకు ప్రతీక. ఆమె కోరింది ప్రతీకారం కాదు, న్యాయం మాత్రమే.

ఆ న్యాయం అంత సులభంగా దక్కలేదు. స్థానిక పోలీసుల నిర్లక్ష్యం, బెదిరింపుల మధ్య సుప్రీంకోర్టు జోక్యంతో దర్యాప్తు సీబీఐకి, విచారణ ముంబైకి మారాయి. 2008లో పదకొండు మందికి జీవిత ఖైదు పడింది. 2017లో బాంబే హైకోర్టు దానిని సమర్థించింది. ఇంత కష్టపడి సాధించిన శిక్షను 2022 ఆగస్టు 15న, స్వాతంత్ర్య దినోత్సవం నాడే, గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పేరుతో తుడిచేసింది. ఆ పదకొండు మంది జైలు గేటు దాటినప్పుడు జరిగిన దృశ్యాలు చూసి దేశం నివ్వెరపోయింది. వారికి పూలమాలలు వేశారు, స్వీట్లు పంచారు, పాదాభివందనాలు చేశారు, సన్మానాలు చేశారు. కూతురిని చంపినవాడికి, తల్లిపై అత్యాచారం చేసినవాడికి దక్కిన ఆ గౌరవం ఈ సమాజంలో కొందరి ఉన్మాదానికి నిదర్శనంగా నిలిచింది.

2024 జనవరిలో సుప్రీంకోర్టు ఆ విడుదలను రద్దు చేసింది. విచారణ జరిగిన రాష్ట్రానికి మాత్రమే శిక్ష తగ్గించే అధికారం ఉంటుందని, గుజరాత్ ప్రభుత్వానికి ఆ అధికారం లేదని స్పష్టం చేసింది. దోషులను తిరిగి జైలుకు పంపింది. రాజ్యాంగ వ్యవస్థ తనను తాను సరిదిద్దుకున్న క్షణం అది. కానీ ఆ తప్పు జరగడానికి అనుమతించిన వ్యవస్థల జవాబుదారీతనం ఇప్పటికీ ప్రశ్నార్థకమే.

ఇప్పుడు వచ్చిన బెయిల్ ఉత్తర్వులను న్యాయపరమైన ప్రక్రియగానే చూడాలి. అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు సుదీర్ఘకాలం జైల్లో ఉన్నవారికి, తీవ్ర అనారోగ్యం ఉన్నవారికి కోర్టులు ఇలాంటి ఉపశమనం ఇవ్వడం అసాధారణం కాదు. కోర్టు విధించిన షరతులు వారిని కట్టడి చేయాలి. కానీ ప్రశ్న చట్టబద్ధతకు మించినది. బాధితురాలి భద్రత మాటేమిటి? గతంలో ఇలాంటి వారికి మాలలు వేసిన సమాజం ఇప్పుడు ఏ సందేశం ఇస్తుంది? మరోసారి ఎవరైనా వారిని వీరులుగా కీర్తిస్తే, అది దేశ ఆత్మకే అవమానం. బిల్కిస్ బానోకు జరిగింది ఒక కుటుంబానికి జరిగిన అన్యాయం కాదు. మానవత్వంపై జరిగిన దాడి అది. న్యాయం ఆలస్యమైనా అందాలని ఆమె నిరూపించారు. ఇప్పుడు ఈ సమాజం, ఈ పాలకులు ఆమెకు రుణపడి ఉన్నారు. దోషులకు శిక్ష తగ్గింపు కాదు, బాధితులకు భరోసా కావాలి. క్రూరత్వాన్ని సత్వరవర్తనగా లెక్కించే వ్యవస్థ మారాలి. నేరస్థులు సన్మానాలు అందుకునే రోజులు మళ్ళీ రాకూడదు.

సంపాదకీయం

లక్షలాది మంది దేశ పౌరసత్వానికి స్వస్తి..

ఐదేళ్లలో 9 లక్షల మంది దేశాన్ని వీడటం ఆందోళనకరం... మేధోసంపత్తి, నైపుణ్యాన్ని కోల్పోతున్న భారత్.. పౌరసత్వం వదులుకుంటున్న వారి వివరాలపైనా స్పష్టత లేని కేంద్రం

భారతదేశంలో పుట్టి పెరిగి ఉన్నత విద్యను అభ్యసించి. విదేశాలకు మన దేశ యువతి యువకులు వలసలు వెళ్లి అక్కడే ఉండడం. భారతదేశ పౌరసత్వాన్ని వదులుకోవడం. మన పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. వెలిగిపోతుందన్న భారతదేశంలో నేడు విదేశాలకు యువతి యువకులు వెళ్లి అక్కడే ఉండి. మన దేశాన్ని పౌరసత్వం వదులుకోవడం బాధాకరం.. మన దేశ మేధస్సు విదేశాలకు ఉపయోగపడుతుంది. మన దేశ శ్రమ విదేశాలలో శ్రమ సౌందర్యానికి నాంది పలుకుతుంది.. మన పాలకులు యువతి యువకుల కోసం ప్రణాళికలు బాగుంటే మన దేశాన్ని వదిలి ఎందుకు పోతారు అన్నది ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. యువతను ఉపాధిని ఉద్యోగ అవకాశాలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేస్తున్నాయి. దీని మూలంగా వలసల సంఖ్య భారీగా పెరిగింది అని చెప్పవచ్చు.



భారతదేశం నుంచి లక్షలాది మంది పౌరులు తమ పౌరసత్వాన్ని వదులుకొని విదేశాల్లో స్థిరపడుతున్న పరిణామం దేశ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని .పేర్కొన్నారు. పార్లమెంటులో కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించిన గణాంకాలే దేశంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.. ఇది కేవలం వ్యక్తిగత నిర్ణయాల సమస్యగా కాకుండా పాలకుల ఆర్థిక విధానాలు, పాలనా వైఫల్యాల కోణంలో పరిశీలించినట్లయితే అన్ని విషయాలు వాస్తవాలు వెలుగు చూస్తాయి.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించిన వివరాల ప్రకారం, 2020 నుంచి 2024 వరకు ఐదేళ్లలో 8,96,843 మంది భారత పౌరసత్వాన్ని వదులుకున్నారు. 2022లో 2,25,620 మంది, 2023లో 2,16,219 మంది, 2024లో 2,06,378 మంది పౌరసత్వాన్ని వదులుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు దేశ పౌరసత్వాన్ని వదులుకుంటున్నప్పటికీ, వారి ఆదాయ స్థాయి, వృత్తులు, విద్యార్హతలు, ఆర్థిక నేపథ్యానికి సంబంధించిన సమాచారం కూడా తమ వద్ద లేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు చెప్పడం బాధ్యతారాహిత్యమని తెలిపారు. దేశం నుంచి ఎంతటి మేధోసంపత్తి, ఆర్థిక వనరులు తరలిపోతున్నాయో అంచనా వేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం విచారకరం.

దేశంలో పెరుగుతున్న అవినీతి, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పారిశ్రామిక రంగంలో గుత్తాధిపత్య ధోరణులు, ప్రభుత్వ విధానాల్లో అనిశ్చితి నిజమైన పారిశ్రామికవేత్తలకు ప్రతికూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయని ఈశ్వరయ్య పేర్కొన్నారు. కొద్దిమంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను సంక్షోభంలోకి నెట్టడం వల్ల స్వతంత్ర పారిశ్రామిక అభివృద్ధి దెబ్బతింటోందన్నారు. మరోవైపు, బ్యాంకుల్లో ప్రజల పొదుపు సొమ్మును భారీ కార్పొరేట్ రుణాలుగా అందించి, అవి నిరర్థక ఆస్తులుగా మారుతున్నా బాధ్యులపై జవాబుదారీతనం కొరవడుతోందన్నారు. ప్రజల సొమ్ముకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయనే విమర్శలకు సమాధానం చెప్పాలన్నారు. మనదేశంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసినారు. వ్యవసాయ పరిశోధన వేత్తలు అధ్యాపకులు మంచి వేతనాలు చైనా దేశంలో చెల్లిస్తుంటే మనదేశంలో మాత్రం అంతంత మాత్రంగానే చెల్లిస్తున్నారు. వ్యవసాయం దండ గాని పాలకుల ప్రచారం సిగ్గుచేటు...

ఈ పరిణామాల వల్ల దేశం కోల్పోతున్నది కేవలం వ్యక్తులను మాత్రమే కాదని, వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలు వంటి విలువైన మానవ వనరులు విదేశాల్లో స్థిరపడితే దేశీయ అభివృద్ధికి తీవ్ర నష్టం కలుగుతుందని వివరించారు. వైద్య రంగంలో ఇప్పటికే వైద్యుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యారంగంలో అధ్యాపకులు, పరిశోధకుల కొరత ఉన్నత విద్యా ప్రమాణాలను ప్రభావితం చేస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు, పరిశోధకుల సేవలు తగ్గితే పంటల ఉత్పాదకత, సాంకేతిక పరిజ్ఞానం, ఆహార భద్రతపై ప్రభావం పడుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో నిపుణులు, పెట్టుబడిదారులు విదేశాలకు తరలిపోతే కొత్త పరిశ్రమలు, ఉత్పత్తి, ఉపాధి కల్పనకు అవకాశాలు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తుంది దేశవ్యాప్తంగా నిరుద్యోగుల శాతం రోజురోజుకు పెరుగుతుంది. మరోవైపు పల్లెల నుండి పట్టణాలు నగరాలు వలసలు వస్తున్నారు. భారతదేశ అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ. ఉపాధి ఉద్యోగాలు అవకాశాలు ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. నేటి యువతీ యువకుల కోసం ఆలోచించడం లేదు. దేశంలో ఉన్నటువంటి అనేకమైన విశ్వవిద్యాలయాల్లో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.. మరోవైపు మనదేశంలో పుట్టినటువంటి యువత విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. భారతదేశంలో ఉపాధి లేదనేది కాదు. ప్రభుత్వ రంగ సంస్థలలో. లక్షలాది ఉద్యోగాలు ఖాళీ ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. మన దేశంలో పుట్టిన పౌరులు విదేశాలలో వలసలు పోతుంటే మనదేశంలోకి మాత్రం పాకిస్తాన్. బంగ్లాదేశ్. బర్మా. రోహింగాలు మనదేశంలో వచ్చి ఉండిపోతున్నారు. దొంగ చాటున భారతదేశంలోకి చొరబడుతున్నారు. మన దేశం లో పుట్టి ఆయా దేశాలలో ఉండిపోతూ మన దేశ పౌరుషత్వాన్ని వదులుకుంటున్నారు. పాలకులు వీటి మీద దృష్టి పెట్టకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి...

వారు దేశంలోనే ఉంటే కొత్త పరిశ్రమలు స్థాపించవచ్చని, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించవచ్చని, పరిశోధనలు చేయవచ్చని, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చని ఈశ్వరయ్య పేర్కొన్నారు. వారిని తయారు చేయడానికి దేశంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల ద్వారా ప్రజాధనంతో పెట్టిన పెట్టుబడికి దక్కాల్సిన ప్రయోజనాలు ఇతర దేశాలకు చేరుతున్నాయని, దీనినే బ్రెయిన్ డ్రెయిన్ (మేధో వలస) అంటారని వివరించారు. ఈ మానవ వనరుల నష్టానికి తోడు పెట్టుబడులు, పన్నుల ఆదాయం, ఉత్పత్తి, పరిశోధన, ఉపాధి అవకాశాల్లో దేశం కోల్పోతున్న దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలపై సమగ్ర అంచనా వేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపే విదేశీ చెల్లింపులు దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడుతున్నప్పటికీ, వాటితో దేశం కోల్పోతున్న మేధోసంపత్తి, పరిశ్రమలు, పరిశోధనలు, ఉపాధి అవకాశాల నష్టాన్ని భర్తీ చేయలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేశారు. విదేశీ మారకద్రవ్యం రావడం ఎంత ముఖ్యమో, దేశీయంగా సంపద సృష్టి, ఉత్పత్తి, పెట్టుబడులు, ఉపాధి పెరగడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన భారతదేశంలో యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించలేకపోవడం పాలకుల ఆర్థిక విధానాల వైఫల్యం కాదా? ప్రతిభావంతులు దేశంలోనే ఉండి పనిచేయడానికి అవసరమైన అవకాశాలు ఎందుకు కల్పించడం లేదు? కొద్దిమంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కంటే కోట్లాది ప్రజల ప్రయోజనాలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు? ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం తక్షణమే పౌరసత్వం వదులుకుంటున్నవారిపై సమగ్ర అధ్యయనం చేపట్టి, దేశం కోల్పోతున్న మానవ వనరులు, పెట్టుబడులు, మేధోసంపత్తి, ఆర్థిక అవకాశాలపై ఎప్పటికప్పుడు శ్వేతా పత్రాన్ని విడుదల చేయాలి. అవినీతిని అరికట్టి, బ్యాంకింగ్ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రక్షణ కల్పించడంతోపాటు యువతకు దేశంలోనే ఉపాధి, పరిశోధన, పారిశ్రామిక అవకాశాలు తో పాటు చిన్న మధ్య సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దేశాన్ని విడిచిపోతున్న పౌరులను తప్పుపట్టడం కాదని, దేశంలోనే ఉండాలనే విశ్వాసాన్ని కల్పించలేకపోతున్న పాలకుల ఆర్థిక విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

ప్రజల ప్రతిభ, శ్రమ, మేధోసంపత్తిని దేశాభివృద్ధికి ఉపయోగించుకోలేని పాలకులు అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కుపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. దేశ సంపదను కాపాడటం, యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత .. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిచి మన దేశ యువతను మన దేశంలోనే ఉంచి వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఆ కల్పించినట్లయితే విదేశాల చూపు చూడరు. మన దేశ మేదస్సును మన దేశానికే వినియోగించాలి. అప్పుడే భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుంది. ఉపాధి ఉద్యోగాలు విద్య వైద్యంలో పెద్దపీట వేసి. ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకొని ప్రజా సంక్షేమ వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే వలసలతో మన భారతదేశ ఆర్థిక వ్యవస్థ. మన దేశ మేదస్సు పూర్తిగా దెబ్బతింటుంది.



దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696

ఇంటర్మీడియట్ విలీనంతో కార్పొరేట్ దోపిడీకి కళ్కెం పడేనా?

నేటివిద్యా వ్యవస్థలో పోటీ తత్వం విద్యార్థుల భవిష్యత్తును శాసిస్తోంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల ఒత్తిడి పెరుగుతుంది. ఇంటర్మీడియట్ దశకు వచ్చేసరికి ఆర్థిక భారం, చదువు ఒత్తిడి పెరిగి డ్రాపౌట్ రేట్లు అధికమవుతున్నాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్యకు ఇంటర్మీడియట్ విద్యకు మధ్య సరైన అనుసంధానం లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్లమెంట్ లోక్‌సభ అంచనాల కమిటీ 2026 నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా ఒకటో తరగతిలో చేరిన విద్యార్థుల్లో దాదాపు 73 శాతం మంది హయ్యర్ సెకండరీ (ఇంటర్మీడియట్) పూర్తి కాకముందే వివిధ దశల్లో చదువు మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. నీతి ఆయోగ్ 2026 నివేదిక ప్రకారం... తెలంగాణలో 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లోకి ప్రవేశించే విద్యార్థుల రేటు 72.8శాతం మాత్రమే ఉంది. అంటే మిగిలిన 27.2శాతం మంది విద్యార్థులు తదుపరి విద్యా స్థాయికి వెళ్లడం లేదు. ఇందులో బాలికలు, గ్రామీణ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యతో ఇంటర్మీడియట్ విద్యను సమీకృతం చేయాలనే నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

మెజార్టీ రాష్ట్రాలలో పాఠశాల విద్యలోనే ఇంటర్మీడియట్

దేశంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జడీూజు) పరిధిలో 9, 10 తరగతులను సెకండరీ విద్యగా, 11, 12 తరగతులను సీనియర్ సెకండరీ విద్యగా పరిగణిస్తారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత వేరే జూనియర్ కళాశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించే అవకాశం ఉంటుంది. మెజార్టీ రాష్ట్రాలలో కూడా ఇంటర్మీడియట్ విద్య పాఠశాలలోనే కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా తదితరులు రాష్ట్రాల్లో మాత్రమే ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేకంగా కొనసాగుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో 10వ తరగతి వరకు చదువుకోవడానికి పాఠశాలలు ఉన్నప్పటికీ.. జూనియర్ కళాశాలలు దూరంగా ఉండటం వల్ల రవాణా ఖర్చులు, బాలికల భద్రత సమస్యలు, ఆర్థిక భారం చదువుకు ఆటంకంగా మారుతున్నాయి. ఫలితంగా కొందరు విద్యార్థులు మధ్యలోనే చదువును మానేస్తున్నారు. జాతీయ విద్యా విధానం-2020 కూడా సంప్రదాయ 10+2 విద్యా నిర్మాణానికి బదులుగా 5+3+3+4 విధానాన్ని ప్రతిపాదించింది. ఇందులో 3 నుంచి 8 సంవత్సరాల వయస్సు వరకు ఫౌండేషనల్ దశ, 8 నుంచి 11 సంవత్సరాల వరకు ప్రిపరేటరీ దశ, 11 నుంచి 14 సంవత్సరాల వరకు మిడిల్ దశ, 14 నుంచి 18 సంవత్సరాల వరకు సెకండరీ దశగా విభజించారు. ముఖ్యంగా 9 నుంచి 12 తరగతులను నాలుగేళ్ల సెకండరీ విద్యగా పరిగణించడం ద్వారా విద్యార్థులకు విస్తృతమైన విషయ పరిజ్ఞానం, సబ్జెక్టుల ఎంపిక స్వేచ్ఛ, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

తెలంగాణ విద్య వ్యవస్థలో నూతన మార్పులు.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు పదో తరగతి వరకు పాఠశాల విద్య, ఆ తర్వాత ఇంటర్మీడియట్ విద్యను ప్రత్యేక జూనియర్ కళాశాలల ద్వారా అందిస్తున్నారు. అయితే ఈ రెండు విభాగాలను సమీకృతం చేస్తూ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం 2027-28 నుంచి ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యా నిర్మాణంలో నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్యగా, ఐదో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్యగా, తొమ్మిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజించనున్నారు. అంటే ప్రస్తుతం జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ 11, 12 తరగతులను పాఠశాల విద్యాలోకి తీసుకురానున్నారు. ఈ నిర్ణయం ద్వారా విద్యా వ్యవస్థలో పరిపాలనా సమస్యయం పెరగడంతో పాటు విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గుతాయని ఆశిస్తున్నారు. ఈ తరహా సమీకృత విద్యా విధానాన్ని తెలంగాణ విద్యా కమిషన్ కూడా ప్రతిపాదించింది. ఆకునూరి మురళి నేతృత్వంలోని కమిషన్ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ఒకే ప్రాంగణంలో అందించే విధంగా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' నమూనాను సూచించింది.

కార్పొరేట్ దోపిడీ ఆగేనా...

ప్రస్తుతం విద్యావ్యవస్థలో కార్పొరేట్ దోపిడీ విపరీతంగా పెరిగిపోయింది. ఐఐటీ, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. లక్షల రూపాయల ఫీజులు, ప్రత్యేక కోచింగ్‌లు, హాస్టల్ ఖర్చులు, ర్యాంకుల కోసం ఒత్తిడి విద్యార్థులను మానసికంగా, ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ పోటీ వ్యవస్థలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా అట్టడుగు బీసీ ఎస్సీ ఎస్టి వర్గాల పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యతో విలీనం చేయడం వల్ల కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందా? అనేదే అసలు ప్రశ్న. ప్రభుత్వాలు కూడా ఈ విద్యా వ్యాపార విస్తరణకు అవకాశం కల్పించాయనే ఆరోపణలున్నాయి. కాబట్టి ప్రభుత్వం నూతన నిబంధనల అమలులో నిక్కచ్చిగా, పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులపై కఠిన నియంత్రణ విధించినప్పుడే విద్యా దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. లేనిపక్షంలో కార్పొరేట్ విద్యా వ్యాపారం యథాతథంగా కొనసాగుతుంది. మరి తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే నూతన మార్పులు కార్పొరేట్ విద్యా దోపిడీకి ముగింపు పలుకుతుందా? లేక కేవలం పరిపాలనా పునర్వ్యవస్థీకరణగానే మిగిలిపోతుందా? చూడాలి.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

బిల్లులపై బలమైన పోరు.. ప్రతిపక్షంలో ఐక్యత ఏది?!

ప్రతిపక్ష ఇండియా కూటమిలో బిల్లుల విషయంలో ఐక్యత సాధించగలిగే సత్తా లేదా? డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంటులో అడ్డుకోగలిగిన ప్రతిపక్షం ఇప్పుడు ఛిన్నాభిన్నమవుతున్నదా? కాంగ్రెస్‌కు గానీ, ఇతర ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలకు గానీ ఈ బిల్లులపై స్పష్టమైన అవగాహన ఉందా? ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు, సవరణలతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేకూరకుండా సూచనలు చేసే ధీమా ఉందా? నిజంగా ప్రతిపక్ష ఐక్యతతో బిల్లుల్లో దక్షిణ భారత వ్యతిరేక అంశాలను ప్రవేశపెట్టకుండా అడ్డుకోవాలనే చిత్తశుద్ధి ఇండియా కూటమికి ఉన్నదా? ప్రతిపక్షం ఏకపక్షమైందనే భావన ప్రజల్లో కలగకుండా కాంగ్రెస్ పార్టీ కూటమి భాగస్వామ్య పక్షాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సమగ్ర ప్రత్యామ్నాయ ప్రతిపాదన చేయగలదా? పార్లమెంటు ప్రత్యేక సమావేశంపై వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుందా?

దేశ రాజకీయాల్లో ఇప్పుడు ఈ ప్రశ్నలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పార్లమెంటులో ప్రభుత్వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదనలను నిలువరించడంలో ప్రతిపక్షాలు కొంత వరకు విజయం సాధించాయి. అయితే ఒక బిల్లును ఓడించడం వేరు, దానికి ప్రత్యామ్నాయంగా దేశమంతా ఆమోదించే పరిష్కారాన్ని చూపించడం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించడంలోనే ఇండియా కూటమి రాజకీయ పరిణతి వెల్లడవుతుంది. కేవలం ప్రభుత్వ ప్రతిపాదనలను వ్యతిరేకించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం సంపాదించలేరు.

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై దేశవ్యాప్తంగా సానుకూలత ఉంది. అయితే మహిళా రిజర్వేషన్ల అమలును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడమే వివాదానికి కారణమైంది. లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850 వరకు పెంచుతూ జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజించే ప్రతిపాదన దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన కలిగిస్తోంది. జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలు తక్కువ జనాభా పెరుగుదల కారణంగా తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోవాల్సి వస్తుందన్న భయం సహేతుకమైనదే. దేశాభివృద్ధికి బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలకు రాజకీయంగా శిక్ష పడే పరిస్థితి రాకూడదు.

అయితే ఈ సమస్యను కేవలం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకే పరిమితం చేయలేం. ఇది భారత సమాఖ్య వ్యవస్థ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. రాష్ట్రాలన్నింటికీ సముచిత రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలి. జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యాన్ని సమీక్షించాలన్న రాజ్యాంగపరమైన అంశాన్ని పూర్తిగా విస్మరించలేం. అదే సమయంలో జనాభా నియంత్రణలో విజయాలు సాధించిన రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యత తగ్గకుండా చూడాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే పరిష్కారం కావాలి.

ఇక్కడే ఇండియా కూటమిలోని విభేదాలు బయటపడుతున్నాయి. కాంగ్రెస్ ఒక వైఖరిని ప్రకటిస్తుంటే, ప్రాంతీయ పార్టీలు తమ రాష్ట్రాల రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. డీఎంకే దక్షిణాది ప్రాతినిధ్యానికి ముప్పు వాటిల్లుతుందన్న ఆందోళనతో తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మరోవైపు కొన్ని భాగస్వామ్య పక్షాలు అన్ని రాష్ట్రాలకూ సమాన శాతం స్థానాల పెంపు వంటి ప్రతిపాదనలను పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిస్తున్నాయి. ఈ భిన్నాభిప్రాయాలను సమన్వయం చేయకపోతే కూటమి ఐక్యత కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వాన్ని వ్యతిరేకించే సమయంలో ఒక్కటిగా కనిపించిన పార్టీలు ప్రత్యామ్నాయ విధానం రూపొందించే విషయంలోనూ కలిసివస్తాయా అన్నదే అసలు ప్రశ్న.



మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా ప్రస్తుత లోక్‌సభ స్థానాల్లోనే 33 శాతం కోటాను అమలు చేయాలన్న కాంగ్రెస్ ప్రతిపాదన చర్చించదగినదే. కానీ దీనితోపాటు భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన ఎలా జరగాలి? దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యానికి ఎలాంటి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలి? అన్ని రాష్ట్రాలకు

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

- విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి
- సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి పోలీసు అధికారి అవగాహన పెంచుకోవాలి
- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం
- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మెట్‌పల్లి, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. పోలీసు సేవల నాణ్యత, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల సమీక్షలో భాగంగా సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు విధానం, రికార్డులు, స్టేషన్ నిర్వహణను పరిశీలించారు. ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి నాణ్యమైన దర్యాప్తు ద్వారా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించాలని, డయల్ 112కు వచ్చే ప్రతి కాల్‌కు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను 5ఎస్ విధానంలో పరిశుభ్రంగా ఉంచడంతోపాటు సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, యూనిఫాం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఆధునిక పద్ధతులతో పోలీసు సేవలను మెరుగుపరచాలని తెలిపారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంచాలని, విలేజ్ పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణకు కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, ఇన్‌స్పెక్టర్లు సురేష్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు కిరణ్‌కుమార్, రాజునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ల కష్టాలు తెలుసు
నావంతుగా సహకరిస్తా
ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్..



రాయికల్ జనం సాక్షి నవంబర్ : రాయికల్ పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత్రికేయుల సేవలను గుర్తిస్తు ఎమ్మెల్యే డాక్టర్ సంజాయ్ కుమార్ పాత్రికేయులను శాలువాలతో సత్కరించారు అనంతరం అయన మాట్లాడుతు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకపోవడం జర్నలిస్ట్ ల పాత్ర కీలకం అని అన్నారు రెండు సార్లు శాసన సభ్యునిగా నియోజకవర్గ అభివృద్ధి గతంలో ఎవ్వరు చెయ్యలేని విధంగా చేసానని ప్రజల మద్దతుతో విమర్శలకు అభివృద్దే సమాధానం అని రాయికల్‌లో జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు కావాలని స్వంత ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చెయ్యాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చింతకుంట సాయికుమార్ కోరగా విలేకరులకు ఇండ్ల స్థలాల అంశం పట్ల ప్రభుత్వం అనుకూలంగా ఉన్నప్పటికినీ ఇట్టి అంశం కోర్టులో ఉందని మరియు ఇట్టి అంశంపై పౌర సమాచార మంత్రి ప్రెస్ అకాడమీ చైర్మన్ దృష్టికి తీసుకపోవడం జరిగిందని మరియు ప్రెస్ క్లబ్ స్వంత భవనం ఏర్పాటు భూమి కొరత ఉన్నప్పటికినీ ఇట్టి అంశం పరిశీలిస్తామని అన్నారు అనంతరం పాత్రికేయులను శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య ,కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్ గౌరవ అధ్యక్షులు సయ్యద్ రసూల్ సూపర్ సీనియర్ జర్నలిస్ట్ లు గుర్రాల వేణు ,నాగమల్ల శ్రీకర్ ,ఎండి ముజాఫర్ ,ఉప అధ్యక్షులు సింగని శ్యామ్ సుందర్ ,యాచమనేని కిరణ్ రావు సంయుక్త కార్యదర్శి తిరుమల శంకరయ్య ,సీనియర్ జర్నలిస్ట్ లు నాగిరెడ్డి పటేల్ నరేందర్ మచ్చ శేఖర్ రఘుపతి ,గంగధారి సురేష్ ,వాసం లింబాద్రి ,ఎద్దండి జితెందర్ మాలావత్ వెంకటేష్ ,అనుపురం లింబాద్రి గౌడ్ సభ్యులు చెలిమెల మల్లేశం గంట్యాల ప్రవీణ్ ,ఏనుగంటి రాజు ,గట్టుపల్లి నరేష్ ,కోమటి రెడ్డి కృష్ణా రెడ్డి ,కొండ కళ్యాణ్ గన్నవరం గంగాధర్ ,బెక్కం సుధాకర్ ,ఇర్ఫాన్ నాయకులు కోల శ్రీనివాస్ ,పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్ గన్నే రాజారెడ్డి మోర హన్మండ్లు మున్ను కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం
రూ.ఐదు లక్షల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి); బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చెక్కును జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెంగల వెంకటేశం ఇటీవల మరణించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఆర్థిక ఇబ్బందులు గమనించి.. రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసింది.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం వెంగల వెంకటేశం భార్య సులోచన కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు అయిన రూ.ఐదు లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ అందజేశారు. తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి వెంగల సులోచన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి ఉన్నారు.

ధాన్యం దళారులు పాలు

- రైస్ మిల్లర్లతో కుమ్మక్కైన ప్రభుత్వం
- రైతుల ధాన్యం కొనుగోలుపై భారతీయ జనతా పార్టీ పోరాటం



ముస్తాబాద్ నవంబర్ 16 (జనం సాక్షి) : ముస్తాబాద్ భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ ఆధ్వర్యంలో లో ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తక్షణమే ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతుల నుంచి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అలాగే రైతులకు అందవల్సిన 500 రూపాయలు బోనస్ కూడా దళారులకు అమ్ముడు పోయిన లక్ష క్వింటాళ్లకు 5 కోట్ల రూపాయలు ముస్తాబాద్ రైతంగానికి దక్కకుండా చేస్తున్నందుకు భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ తరపున ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది.రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఎలాంటి జాప్యం చేయకుండా, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఇట్టి కార్యక్రమం లో మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల సత్యం రెడ్డి, ఎఇ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మీస స్వామి, గూడెం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు,మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, శక్తి కేంద్రం ఇంచార్జి కటకం మహేష్,వార్డు మెంబర్ మర్గల వేణుగోపాల్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

అటవీ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు

సిరికొండ నవంబర్ 16 (జనం సాక్షి) : రేంజ్ పరిధిలోని పందిమడుగు సెక్షన్లో బీట్ కంపార్ట్మెంట్ 482లో హక్కుపత్రాలు లేకున్నా గాని చెట్లను నరకడం, అడవికి నిప్పు పెట్టి, వన్యప్రాణులకు హాని తలపెట్టే విధంగా ప్రవర్తించిన పంది మడుగు గ్రామానికి చెందిన జరుపుల ప్రతాప్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిరికొండ రేంజ్ అటవీ శాఖ రేంజ్ అధికారి నర్సింగ్ రావు తెలిపారు.

ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ కొందరు వ్యక్తిగత స్వార్థం కోసం, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణ సమస్యకు ఉపయోగపడే, అడవి నరకడం వంటి చర్యలకు పాల్పడితే అటవీ చట్టం ప్రకారం, వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎఫ్‌ఆర్‌ఓ నర్సింగరావు హెచ్చరించారు.



పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

- 3,812 మందికి 'చేయూత' పెన్షన్ల మంజూరు
- కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ
- 66 డివిజన్ల లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన మేయర్, డిప్యూటీ మేయర్, కమీషనర్, ఏఎంసీ, పాలకవర్గ సభ్యులు

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి) : ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో 'చేయూత' పెన్షన్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అతిథులుగా హాజరయ్యారు. నగరంలోని మొత్తం 66 డివిజన్ల పరిధిలో కొత్తగా ఎంపికైన 3,812 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పాలకవర్గ సభ్యులతో కలిసి ముఖ్య అతిథులు లబ్ధిదారులకు తమ చేతుల మీదుగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలను అందించడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని గత 8, 9 సంవత్సరాలు నుండి కొత్త పెన్షన్ లేక చాలా ఇబ్బంది నిరుపేదలు లబ్ధిదారులు అనేక అవస్థలు పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నూతనంగా పెన్షన్లు మంజూరు తో పాటు లబ్ధిదారులకు గతంలో ఇందిరమ్మ ఇల్లు, 2 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, ఆరోగ్యశ్రీ 10 లక్షల అనేక కార్యక్రమాలను విజయవంతంగా చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అందరు మంచి మనస్సుతో ఆశీర్వదించాలని స్పష్టం చేశారు.

నిబంధనల ప్రకారం భూ రీ-సర్వే పూర్తి చేయాలి

- పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- మల్కాపూర్‌లో వారాంతంలోగా సర్వే పూర్తి
- అల్లూరులో కో-రిలేషన్ స్టేట్‌మెంట్ సిద్ధం చేయాలి
- జంగావ్‌లో నెలాఖరులోగా ప్రక్రియ ముగించాలి

గోదావరిఖని (జనం సాక్షి): భూ రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం రామగుండం మండలం మల్కాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని సమీక్షించారు. మల్కాపూర్‌లో రీ-సర్వేను ఈ వారాంతంలోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణం, హద్దులను క్షుణ్ణంగా పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరిపోల్చాలని పేర్కొన్నారు. అల్లూరు గ్రామానికి సంబంధించిన కో-రిలేషన్ స్టేట్‌మెంట్‌ను త్వరగా సిద్ధం చేయాలని, మల్యాలపల్లిలో రీ-సర్వే ప్రారంభించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జంగావ్ గ్రామంలో నవంబర్ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

భూ యజమానులకు ముందస్తు సమాచారం అందించి వారి సమక్షంలో హద్దులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో గుర్తించిన వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి, వ్యత్యాసాలు, అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని, పనుల్లో నాణ్యత, ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, రీ-సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ పత్రాల పంపిణీ చేసిన కౌన్సిలర్ విక్రం రెడ్డి

మొయినాబాద్,నవంబర్16, జనంసాక్షి: నూతన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం సందర్భంగా 12 వ కౌన్సిలర్ మరియు కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు అవురం విక్రమ్ రెడ్డి నూతన పెన్షన్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 6 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో ఒకరికి కూడ నూతన పెన్షన్ రాలేదన్నారు. ఇప్పుడు పేదల కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నూతన పెన్షన్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తుందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజల సంక్షేమం కొసం ప్రతి నిత్యం కృషి చేస్తుందని తెలిపారు. చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేయడంతో వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు హర్షం ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- ఎన్‌టీపీసీ రామగుండంలో విక్రేతల అభివృద్ధి కార్యక్రమం
- సేకరణలో ఎంఎస్ఈల భాగస్వామ్యం పెంచడమే లక్ష్యం
- టెండర్లు, జీఈఎం రిజిస్ట్రేషన్‌పై అవగాహన
- సమ్మిళిత వృద్ధికి కృషి: ఈడీ ఫైజ్ తయ్యబ్

గోదావరిఖని (జనం సాక్షి): ఎస్సీ, ఎస్టీ, మహిళల యాజమాన్యంలోని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించే లక్ష్యంతో ఎన్‌టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో ప్రత్యేక విక్రేతల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌వీడీపీ-2026) నిర్వహించారు. ఎన్‌టీపీసీ కొనుగోళ్లలో ఆయా వర్గాల పారిశ్రామికవేత్తల భాగస్వామ్యాన్ని పెంచడం, వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఏజీఎం (సీ అండ్ ఎం) రాకేష్ ఆనంద్ స్వాగతం పలికారు. ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి ఎన్, ఎన్ఎస్ఐసీ హెడ్ ఎస్.సురేష్, డీఐసీసీఐ తెలంగాణ చాప్టర్ హైదరాబాద్ అధ్యక్షుడు సీతారాం సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు అందుబాటులో ఉన్న అవకాశాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై వివరించారు. ముఖ్య అతిథి ఎన్‌టీపీసీ ఈడీ (ఆర్‌అండ్‌టీ) ఫైజ్ తయ్యబ్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలు ఎన్‌టీపీసీ టెండర్లలో చురుగ్గా పాల్గొని సంస్థతో వ్యాపార భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ఎంఎస్ఈల సేకరణ విధానం, భవిష్యత్ వ్యాపార అవకాశాలపై ఎన్‌టీపీసీ



కాంట్రాక్ట్స్ అండ్ మెటీరియల్స్ విభాగానికి చెందిన శివకుమార్ పెనుగొండ, అమన్ పాండే సాంకేతిక సమావేశం నిర్వహించారు. వెండర్ల నమోదు, బూడిద రవాణా అవకాశాలపై డీజీఎం మేడ నాగరాజా, జీఈఎం రిజిస్ట్రేషన్, బిడ్డింగ్ విధానంపై శిక్షకురాలు అహోనా మజుందార్ వివరించారు. వెండర్ ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై ఫైనాన్స్ డీజీఎం బట్టు కిషన్ అవగాహన కల్పించారు. కొనుగోళ్లలో పారదర్శకత, నైతిక విలువల ప్రాధాన్యాన్ని విజిలెన్స్ ఏజీఎం వివరించారు. అనంతరం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు తమ సందేహాలను వెల్లడించగా, ఎన్‌టీపీసీ అధికారులు నివృత్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పిస్తూ పారదర్శకమైన, పోటీతత్వ వ్యాపార వాతావరణాన్ని బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ రామగుండం ప్రతినిధులు తెలిపారు.

342.5 టన్నుల నిర్మాణ వ్యర్థాల తొలగింపు

- సైబరాబాద్ పరిధిలో మూడోరోజూ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్
- 124 వ్యర్థాల హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- 89 ప్రాంతాల్లో పూర్తయిన శుభ్రత పనులు
- 23 చెరువుల వద్ద పారిశుధ్య చర్యలు

శేరిలింగంపల్లి, నవంబర్ 16 (జనం సాక్షి): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం మూడోరోజూ కొనసాగింది. మొత్తం 76 వార్డుల్లో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల తొలగింపునకు అధికారు లు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 124 వ్యర్థాల హాట్‌స్పాట్‌లను



గుర్తించి, 89 ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో శుభ్రత పనులు చేపట్టారు. వ్యర్థాల తరలింపునకు 149 వాహన ట్రిప్పులు నిర్వహించి 342.5 మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తొలగించారు. అదేవిధంగా 23 చెరువుల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో నిరుపయోగంగా పదిలేసిన వాహనాలకు సంబంధించి 53 నోటీసులు జారీ చేశారు. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, క్షేత్రస్థాయి అధికారులు, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యర్థాలు పేరుకుపోయే ప్రాంతాలు, అక్రమంగా పారవేసే ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడంతోపాటు వాటిని నిర్దేశిత పద్ధతుల్లో తరలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పౌరులు, నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టర్లు సహకరించాలని సీఎంసీ అధికారులు కోరారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను అధీకృత మార్గాల్లోనే తరలించాలని, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో బహిరంగంగా పారవేయవద్దని సూచించారు.

కారు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి

తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత



కథలాపూర్, నవంబర్ 16 (జనం సాక్షి): ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామ శివారులో ఈ నెల 12న చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం మేదరి మల్యాల గ్రామానికి చెందిన కోన చంద్రయ్య (43) ట్రాక్టర్‌పై తండ్రియాల నుంచి ఇప్పపల్లి వైపు వెళ్తుండగా, ఎదురుగా రుద్రంగి నుంచి కోరుట్ల వైపు వేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు ఢీకొట్టింది. దీంతో చంద్రయ్య ట్రాక్టర్ ఇంజిన్ కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు కోన సంజయ్ ఫిర్యాదు మేరకు కారు నడిపిన లంబాడిపల్లికి చెందిన గాలిపల్లి సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

సగరుల సమస్యలు పరిష్కరించాలి - కలెక్టర్‌కు వినతి

మంథని, నవంబర్ 15, (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సగర సంఘం పిలుపుమేరకు సగరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుకుల మొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గోదావరిఖని సగర సంఘం కోశాధికారి అంకల్లా రాజా మొగిలి, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, జిల్లా సగర సంఘం ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ మరియు కోశాధికారి దేవుని తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎంజాల సదానందం ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ప్రధాన డిమాండ్లు : సగరులను బీసీ-డి నుండి బీసీ-ఏ లోకి మార్చాలని నాయకులు డిమాండ్ చేశారు. చాలామంది సగర బిడ్డలు 10వ తరగతి తర్వాత చదవలేకపోతున్నారని, డ్రాప్ ఔట్లు జరుగుతున్నాయని, ఉన్నత విద్య కోసం బీసీ-డిలో ఉండడం వల్ల రిజర్వేషన్ సాధించలేకపోతున్నారని, ఉన్నతమైన చదువుల కోసం సీట్లు పొందలేకపోతున్నారని తెలిపారు. అందువల్ల బీసీ-డి నుండి బీసీ-ఏ లోకి మార్చాలని కోరారు. అలాగే 59 జీవో ప్రకారం ప్రభుత్వ టెండర్లలో ఎక్కువ శాతం ఇతర వర్గాల వారే టెండర్లు పొందుతున్నారని, ప్రభుత్వం వెంటనే 59 జీవోని సవరించి సగరులకు 15శాతం నుండి 20 శాతం ప్రభుత్వ పనుల కోసం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.



అలాగే 1986 మురళీధర్ కమిషన్ ప్రకారం బీసీలలో అత్యంత వెనుకబడిన కులంగా సగరులు ఉన్నారని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో చిలకలపల్లి కొమురయ్య, చిలుకపల్లి స్వామి, రాఘవాపురం అధ్యక్షులు గాండ్ల సదయ్య, రామయ్యపల్లి అధ్యక్షులు ఏముంజాల రమేష్, కామనపూర్ అధ్యక్షులు రెవెల్లి శంకర్, కూనరం అధ్యక్షులు కఠినపెల్లి గణేష్, పోతుల కుమార్, కొల్లూరి సుధాకర్, కొల్లూరి విజేందర్, సుతారి శంకర్, పొలంపల్లి గంగరాజు, గుంటి సదయ్య, కానుగంటి సదయ్య, చిదురాల నరసింహ స్వామి, తడిశెట్టి రాజు, జానుగామ సదయ్య, గుంటి ఓదెలు, కనుకుల కిష్టయ్య, చిన్న కల్వల ఉప్పరిపల్లి శివ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం

- గన్నేరువరంలో 364 మందికి చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- ఇందిరమ్మ బీమా పథకం ఈ నెల 19న ప్రారంభం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గన్నేరువరం, నవంబర్ 16 (జనం సాక్షి): అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం గన్నేరువరం మండల కేంద్రం లోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 364 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమా నికి ప్రాధాన్యమిస్తూ ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రాయితీ గ్యాస్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. చేయూత పథకం ద్వారా కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ అర్హులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎంపికైన లబ్ధిదారుల కు మంజూరు పత్రాలు అందజేస్తున్నామన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ నెల 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం చేకూరుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఏఎంసీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్, డీఆర్‌డీఏ పీడీ మచ్

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 నవంబర్ 2026

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తాం

- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- జిల్లా కేంద్రం శిల్పారామంలో చేయూత
- పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 16 (జనం సాక్షి) : మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని అర్హులైన 2,240 మంది వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, నేత కార్మికులకు ప్రభుత్వం కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసింది. సోమవారం శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగున్నర లక్షల మందికి కొత్తగా పింఛన్లు అందిస్తున్నామని, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వివాహం కాని మహిళలు, గీత, నేత కార్మికులకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పింఛన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక కారణాలతో ప్రస్తుతం పింఛన్ మంజూరు కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని, ఈ పథకం ద్వారా లక్షలాది మంది మహిళలు విద్య, ఉపాధి, వైద్యం తదితర అవసరాల కోసం ప్రయాణిస్తూ ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గిస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్ పట్టణంలో సుమారు 62 వేల రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టామని, కొత్తగా మంజూరైన కార్డులను త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. ఈ నెల 19 నుంచి రేషన్ కార్డుదారుల కుటుంబాల్లో పనిచేసే ఒకరికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సంక్షేమంతో పాటు మహబూబ్‌నగర్ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని యెన్నం తెలిపారు. పట్టణంలో రూ.603 కోట్ల వ్యయంతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణ పనులు ప్రారంభించామని, రూ.220 కోట్లతో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ మేయర్ జి. మమత డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.25 కోట్లతో అధునాతన స్టేడియం నిర్మాణం

- క్రీడా రంగ అభివృద్ధికి మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ



మక్తల్, నవంబర్ 16 (జనంసాక్షి) : మక్తల్ పట్టణాన్ని క్రీడా రంగంలో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మక్తల్ పట్టణంలో 25 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అధునాతన స్టేడియం కోసం క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి గ్రౌండ్‌లో స్థలాన్ని పరిశీలించారు. అన్ని రకాల క్రీడలకు అనువుగా, ఆధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన వసతులతో స్టేడియాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. స్టేడియం నిర్మాణానికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం భవనాల తొలగింపుపై కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళిక లేకుండా డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం భవనాలను నిర్మించారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇరిగేషన్ కార్యాలయం వద్ద అన్ని మౌలిక సదుపాయాలతో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత గ్రౌండ్‌లో ఉన్న కళాశాల, ఇండోర్ స్టేడియం భవనాలను తొలగించి, స్టేడియం నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

- టీజీబీ ఎల్కూరు బ్రాంచ్ మేనేజర్ మధుమోహన్ రెడ్డి



మద్దకల్, నవంబర్ 16 (జనంసాక్షి) : ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) పై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎల్కూర్ శాఖ మేనేజర్ మధుమోహన్ రెడ్డి తెలిపారు.సోమవారం ఎల్కూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ శాచురేషన్ క్యాంపైన్ అవగాహన కార్యక్రమానికి గ్రామంలోని రైతులు బ్యాంక్ కస్టమర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో అకౌంట్ పది సంవత్సరములు దాటిన కస్టమర్లు,రైతులు రీ కేవైసీ ఖచ్చితంగా చేయించాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.ప్రధానమంత్రి జనధన్ యోజన,జీవన్ జ్యోతి బీమా,సురక్ష బీమా పథకాల ప్రయోజనాలను వివరించారు.సైబర్ భద్రత,డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగం, సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ,ఏటీఎం పిన్ వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని హెచ్చరించారు.బ్యాంకు నుండి రుణాలు తీసుకున్న సమయంలో తిరిగి మొత్తాన్ని సకాలంలో చెల్లించినట్లయితే అతి తక్కువ వడ్డీ వర్తిస్తుందని, చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తే అధికవడ్డీ పడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయి మహేష్ క్యాషియర్ రాము సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం అమలు చేయాలి

- పీఎఫ్, ఈఎస్ఐ, రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలి
- ఆర్టీయూ జిల్లా అధ్యక్షులు జుబేర్ అహ్మద్



మెదక్, నవంబర్ 16 (జనం సాక్షి) : ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రతి ఆశా వర్కర్‌కు రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు సూచనల మేరకు బీఆర్టీయూ, సీఐటీయూ యూనియన్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ, బీఆర్టీయూ యూనియన్ల ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్ నాగేష్ కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ, ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల విజయానికి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు సేవలు అందించడం, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో నిరంతరం కష్టపడుతున్నప్పటికీ వారికి ఇప్పటికీ కనీస వేతన భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఆశా వర్కర్లతో ప్రభుత్వం అనేక రకాల పనులు చేయించుకుంటూ పారితోషికాలు మాత్రమే చెల్లిస్తోందని, ఎంత కష్టపడి పనిచేసినా అనారోగ్యం, ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు కనీస ఆర్థిక భద్రత కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 2023లో ఆశా వర్కర్లు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆశా వర్కర్ల సమస్యల సాధన కమిటీ నాయకులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జుబేర్ అహ్మద్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 2026 డిసెంబర్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆశా వర్కర్ల పోరాటానికి బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు నాయకత్వంలో యూనియన్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, కోశాధికారి కే. నర్సమ్మ, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు జుబేర్ అహ్మద్, బీఆర్టీయూ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు బైరి రాజు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్యామల, సమత, జిల్లా కార్యదర్శి, నాయకులు రాణి, పెంటమ్మ, స్వప్న, సుజాత, సావిత్రి, దేవమ్మ, లక్ష్మి, కవిత, మంజుల, పుష్ప, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ
- ప్రజావాణిలో 91 వినతుల స్వీకరణ



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 16 (జనం సాక్షి) : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్ . బి హరిప్రియ అధికారులను ఆదేశించారు.సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణి దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, వాటిలోని అంశాలను పూర్తిగా అర్థం చేసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణిలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ సర్వే--రికార్డులు, గృహ నిర్మాణం, రవాణా, పోలీసు, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్యం, గనులు, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 91 వినతులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ నిర్మల, జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్‌చార్జి డి.పి.ఓ వెంకట్‌రెడ్డి, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞాన వికాసం

- బీవీఆర్ఐటీలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



నర్సాపూర్, నవంబర్ 16 (జనం సాక్షి) : పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని అభివృద్ధి చేస్తుందని బీవీఆర్ఐటీ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీప్రసాద్ అన్నారు. నర్సాపూర్‌లోని బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ) సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో సోమవారం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా విష్ణు హైస్కూల్ విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో గ్రంథాలయాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతోపాటు కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యా ప్రగతి, విజ్ఞాన సముపార్జన, వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.అనంతరం ఇంజినీరింగ్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ.. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పుస్తకాలు, విజ్ఞాన వనరులు, గ్రంథాలయ సేవలను విద్యార్థులకు వివరించారు. పఠన అలవాట్లను పెంపొందించుకుని గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.ఎల్.ఎన్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో పాలమూరు యూనివర్సిటీ నిర్లక్ష్యం

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- ప్రశ్నపత్రంలో సిలబస్ తప్పిదాలు
- చివరి గంటలో మార్పులపై సమాచారం ఏబీవీపీ ఆగ్రహం



వనపర్తి, నవంబర్ 16 (జనం సాక్షి) : పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడిందని వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్ ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో యూనివర్సిటీ అధికారుల బాధ్యతారాహిత్యాన్ని నిరసిస్తూ ఏబీవీపీ నాయకులు పరీక్షా కేంద్రం వద్ద ఆందోళన చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవర్ల కార్తీక్ మాట్లాడుతూ.. డిగ్రీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రంలోని సెక్షన్-దీలో 11వ ప్రశ్న రెండో సెమిస్టర్ సిలబస్‌కు సంబంధించినదిగా ఉండటం తీవ్ర అభ్యంతరకరమన్నారు. అంతేకాకుండా 11వ, 15వ ప్రశ్నల్లో మార్పులు చేయాల్సి ఉందని పరీక్ష ముగియడానికి కేవలం చివరి గంట మాత్రమే మిగిలి ఉన్న సమయంలో విద్యార్థులకు సమాచారం అందించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. నెలల తరబడి కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులను చివరి నిమిషంలో ఇలాంటి గందరగోళానికి గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యూనివర్సిటీ అధికారుల తప్పిదాల కారణంగా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావడంతో పాటు వారి పరీక్షా ఫలితాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ప్రశ్నపత్రంలో జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద ప్రశ్నల కారణంగా ఏ ఒక్క విద్యార్థికీ అకడమిక్ నష్టం కలగకుండా న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ అధికారులను ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు.

రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలి



మక్తల్, నవంబర్ 16 (జనంసాక్షి) : ఉట్కూరు మండల పరిధిలోని పెద్ద జట్రం గేటు నుంచి మక్తల్ మండల పరిధిలోని జక్లేర్ అంతర్రాష్ట్ర రహదారి వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాలమూరు ఎంపీ డీకే అరుణ సహకారంతో 36 కోట్లతో నిర్మిస్తున్న రెండు వరుసల రహదారిని సోమవారం ఆయన పరిశీలించారు. గుత్తేదారులు పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదని ఆయన ఆరోపించారు. రహదారి విస్తరణ కోసం రహదారికి పక్కన మట్టిని తీసి ఎలాంటి ప్రమాద సూచికలు కానీ రేడియం స్టిక్కర్లు కానీ అంటించడం లేదని కేవలం మట్టితో నింపిన సంచులను మాత్రమే పెట్టడంతో రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తక్షణమే గుత్తేదారులు వాటిని గుర్తించి రేడియం స్టిక్కర్లను అంటించి ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు. అదేవిధంగా విస్తరణ పనుల్లో భాగంగా రహదారిపై వేసిన కంకరను రోడ్డు రోడ్డు రోలర్ తో చదును చేసే సమయంలోనే కాకుండా మిగతా సమయంలో కూడా పూర్తిస్థాయిలో నీటితో క్యూరింగ్ చేయాలని,కల్వర్టుల నిర్మాణాలలో కూడా నాణ్యతను పాటించాలని దీనికిగాను అధికారులు మొద్దు నిద్రను వీడి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రహదారి విస్తరణ పనులను నాణ్యతతో చేపట్టాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

పేదలకు సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో 18,591 మందికి కొత్తగా చేయూత పింఛన్లు
- అందోల్ నియోజకవర్గంలో 3,130 మందికి మంజూరు
- రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 16 (జనం సాక్షి) : సమాజంలోని పేదలందరికీ విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం అందోల్ మండలం సంగుపేట ఎక్స్‌రోడ్డులోని శ్రీలక్ష్మీదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అందోల్-జోగిపేట మున్సిపాలిటీతో పాటు అందోల్, చౌటకూర్, పుల్కల్, వట్‌పల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేశామని, సంగారెడ్డి జిల్లాలో 18,591 మందికి, అందోల్ నియోజకవర్గంలో 3,130 మందికి కొత్తగా పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులకు పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందోల్ నియోజకవర్గంలో 4 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు సుమారు వెయ్యి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. స్థలం లేని నిరుపేదలకు సైతం ఇళ్లు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు, వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, డ్రోన్ల నిర్వహణ వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని, హుమ్నాపూర్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అందోల్‌ను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.60 కోట్లతో ఫార్మసీ కళాశాల, రూ.35 కోట్లతో న్యాయ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. త్వరలో నర్సింగ్ కళాశాలను కూడా ప్రారంభిస్తామన్నారు. యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించేందుకు 10 నుంచి 15 పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సింగూరు, అందోల్ ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధితో పాటు పెద్దారెడ్డిపేట ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 1,48,562 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.32.73 కోట్ల పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. తాజాగా మరో 18,591 మందికి పింఛన్లు మంజూరు చేయడంతో నెలకు అదనంగా రూ.4.24 కోట్ల ఆర్థిక భరోసా లభించనుందన్నారు. కార్యక్రమానికి హాజరుకాలేక మంజూరు పత్రాలు పొందని వారు సంబంధిత మండల కార్యాలయాల్లో తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రమేష్‌బాబు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావు, మున్సిపల్ కమిషనర్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సగరు(ఉప్పరు)లను బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి మార్చాలి..

- కలెక్టరేట్ ఎదుట సగర సంఘం నిరసన..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): సగరు(ఉప్పరు)లను బీసీ-ఏ లోకి మార్చాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సగర సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఐడిఓసీలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందించిన అనంతరం సగర సంఘం నాయకులు కలెక్టరేట్ ముందు ప్లకార్డులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సగర (ఉప్పర) సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి చంద్రమౌళి మాట్లాడుతూ సగర ఫెడరేషన్ ను పూర్తి స్థాయి సంస్థగా మార్చి పాలకమండలిని నియమించి నిధులు కేటాయించాలని, జీవో 59ని సవరించి ప్రభుత్వ పనుల్లో రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని కోరారు. అలాగే సగరులను భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి ప్రత్యేక ఆరోగ్య భద్రత కార్డు, పింఛను పథకం అమలు చేయాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై శ్రీ సగర భగీరథ మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాత జీవోలు జీవో నెంబర్ 166, 167 జీవో నెంబర్ 16 ప్రకారం తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కురుమ లక్ష్మీనారాయణ, కోశాధికారి పోలంపల్లి సుధాకర్, రాష్ట్ర నాయకులు అయిలి మహేష్, దేవునూరి రాజు, రమేష్, శ్రీధర్, రాములు, రవి, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలో అవకతవకలు..

- అగ్రవర్ణ పేదలకు అన్యాయం..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల, టేకుమట్ల మండలాలలో వందల సంఖ్యలో అనర్హులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేశారని, పేద విద్యార్థుల పొట్ట కొట్టి ధనవంతుల బిడ్డలు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని బీసీ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం బిక్షపతి గౌడ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ చిట్యాల, టేకుమట్ల మండలాలలోని పలు గ్రామాల్లో పదులు, వందల ఎకరాల భూములు ఉన్నవారికి అధికారులు పేద ఓసీల కింద ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు మంజూరు చేశారని అన్నారు. వందల ఎకరాల భూములు ఉండి, వరంగల్, హైదరాబాద్ లాంటి నగరాల్లో పెద్ద ఇండ్లు, భారీగా ఇండ్ల స్థలాలు కలిగిన కోటీశ్వరులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇవ్వడం వల్ల అసలైన నిరుపేద అగ్రవర్ణాల పిల్లలు విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల బీసీ కోటాకు కూడా గండి పడుతోందని, చదువుకోవాలంటే సీట్లు రాక, చదువుకున్న వారికి ఉద్యోగాలు రాక పేద అగ్రవర్ణాల, బీసీ విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. అధికారులను తప్పుదోవ పట్టించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పొంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిపై జిల్లా అధికారులతో కమిటీ వేసి విచారణ చేపట్టాలని, అక్రమంగా సర్టిఫికెట్లు పొందిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చర్లపల్లి సర్పంచ్ బండి రేణుకకు సోషల్ సర్వీస్ అవార్డు



నడికూడ, నవంబర్ 16 (జనంసాక్షి) : శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోషల్ సర్వీస్ అవార్డు-2026 అందుకున్న నడికుడ మండలం చర్లపల్లి గ్రామ సర్పంచ్ రేణుక శంకర్ ముదిరాజ్ కు హైదరాబాద్ లో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం.. ఉత్తమ సర్పంచ్‌గా రేణుక శంకర్ ముదిరాజ్ కు అరుదైన గౌరవం సమాజ సేవయే లక్ష్యంగా, గ్రామ అభివృద్ధిని పరుగులెత్తిస్తూ, నిస్వార్థ సేవలందిస్తున్న ప్రజాప్రతినిధులకు జాతీయ స్థాయిలో సముచిత గుర్తింపు లభించింది. 'మనం ఫౌండేషన్' ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోషల్ సర్వీస్ అవార్డు - 2026' వేడుకల్లో భాగంగా, చర్లపల్లి గ్రామ సర్పంచ్ రేణుక శంకర్ ముదిరాజ్ 'ఉత్తమ సర్పంచ్' పురస్కారాన్ని ఘనంగా అందుకున్నారు. మనం ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా రేణుక శంకర్ ముదిరాజ్ ఈ అవార్డును స్వీకరించారు. కేవలం గ్రామ అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా,చర్లపల్లి గ్రామంలోని వృద్ధులకు ప్రతిరోజూ నిరంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వారి ఆకలి తీరుస్తున్న ఆమె మానవతా దృక్పథాన్ని ఫౌండేషన్ ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా మనం ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తి అవార్డుల ముఖ్య ఉద్దేశాన్ని వెల్లడించారు. సమాజంలో ఎలాంటి ఆశ ఆశయం లేకుండా,అంకితభావంతో నిస్వార్థ సేవనందిస్తున్న సామాజిక కార్యకర్తలను, ప్రజాప్రతినిధులను గుర్తించి ప్రోత్సహించడమే తమ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న సర్పంచ్ రేణుక శంకర్ ముదిరాజ్ లాంటి వారిని సత్కరించడం ద్వారా సమాజంలో మరింత మందికి సేవాభావం పట్ల స్ఫూర్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వివిధ రంగాల విశిష్ట అతిథులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డు గ్రహీత రేణుక శంకర్ ముదిరాజ్ కు ఘనంగా అభినందనలు తెలిపారు.

పెన్ను డౌన్ సత్యాగ్రహానికి సిద్ధమైన సీపీఎస్ ఉద్యోగులు

- సిపిఎస్ ఉద్యోగులు ఉద్యమ బాట ..
- సామూహిక సెలవు దరఖాస్తు..



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 16 (జనం సాక్షి) : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగులకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (ఓపిఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్‌లో సిపిఎస్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఈ మేరకు వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం (ఆర్ ఓ), చిట్స్ శాఖకు చెందిన సిపిఎస్ ఉద్యోగులు సోమవారం జిల్లా రిజిస్ట్రార్‌కు సంయుక్తంగా సామూహిక సాధారణ సెలవు (మాస్ క్యాజువల్ లీవ్) దరఖాస్తును సమర్పించారు. ఈ నెల 17వ తేదీ మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శాంతియుత సత్యాగ్రహ దీక్షలో భాగంగా పెన్ను డౌన్ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఉద్యోగులు వెల్లడించారు. సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగుల పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతపై ఆందోళనలు నెలకొంటున్నాయని, ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. పాత పెన్షన్ విధానం అమలుతోనే ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం స్థిరమైన ఆర్థిక భరోసా లభిస్తుందని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో ప్రజలకు అందించే అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఉద్యోగులు హామీ ఇచ్చారు. తమ నిరసన కార్యక్రమం పూర్తిగా శాంతియుతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం (ఆర్ ఓ), చిట్స్ శాఖకు చెందిన సిపిఎస్ ఉద్యోగులు పాల్గొని ఓ పి ఎస్ పునరుద్ధరణ కోసం తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఉద్యోగుల పెన్షన్ భద్రత, భవిష్యత్తు ఆర్థిక స్థిరత్వం కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి ప్రభుత్వం స్పందించి సిపిఎస్ రద్దు, ఓ పి ఎస్ పునరుద్ధరణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

పిల్లల మాటకు విలువ ఇద్దాం.. వారి అభిప్రాయాలను గౌరవిద్దాం

- నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్
- బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా పిల్లల ప్రజావాణి
- ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార విధానాన్ని విద్యార్థులకు వివరించిన జిల్లా కలెక్టర్
- జిల్లావ్యాప్తంగా పిల్లల ప్రజావాణికి 32 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు ప్రతినిధి, నవంబర్ 16(జనంసాక్షి) : బాలల హక్కుల పరిరక్షణ, పిల్లల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ములుగు జిల్లాలో ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ భాగస్వామ్యంతో "నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్" అనే నినాదంతో నిర్వహించిన పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను ఆహ్వానించి, ప్రజావాణి కార్యక్రమం నిర్వహించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారు చదువుతున్న పాఠశాలల్లో, నివసిస్తున్న ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను శ్రద్ధగా విని, వారు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ, సమస్యల పరిష్కార విధానం, వివిధ శాఖల అధికారులు నిర్వర్తించే బాధ్యతలను విద్యార్థులకు స్వయంగా వివరించారు. ములుగు జిల్లాలో మొత్తం 10 మండలాలు ఉన్నాయని, మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓతో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలకు సంబంధిత అధికారులు అక్కడే పరిష్కారం చూపుతారని వివరించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తులకు వీలైనంత మేరకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యల్లో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరమైన అంశాలను రాష్ట్ర స్థాయికి పంపించి, అనుమతులు పొందిన అనంతరం పరిష్కార చర్యలు చేపడతామని వివరించారు. ప్రజలు తమ సమస్యలపై మండల లేదా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై దరఖాస్తులు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పాఠశాలలకు సంబంధించి లేదా వారు నివసించే ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఆయా సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారుల బృందం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. పిల్లల ప్రజావాణిలో విద్యార్థులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. పిల్లలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సమస్యలను స్వేచ్ఛగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు స్నేహపూర్వక వాతావరణంలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేసి పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 32 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని 10 మండలాల్లో నిర్వహించిన పిల్లల ప్రజావాణిలో 22 దరఖాస్తులు, జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక పిల్లల ప్రజావాణిలో 10 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, ఎం సంపత్ రావు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత, డీఎస్పీ కిషోర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ ఏ రమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో కార్మికుల గోడును వినిపించండి

- మంత్రి వాకాటి శ్రీహరిని కోరిన గిన్నారపూ మహేందర్



ధర్మసాగర్ నవంబర్ 16(జనం సాక్షి) : బిఎన్ఆర్‌కేఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ హైద్రాబాద్ లోనీ మినిస్టర్ క్వాటర్స్ లో తెలంగాణ పశు సంవర్ధక క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి ని కలసి కార్మికులకు రావలసిన సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు నుండి కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిస్కారం చేస్తానన్నారు. ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాటాడుతూ... ఈ పథకాలు అమలు చేస్తే తమ కార్మికులం అంత మరోసారి ఈ ప్రభుత్వానికి పాలాభిషేకం చేస్తామన్నారు లేని యెడల మరి ఉదృతంగా పోరాటాలు చేస్తామన్నారు రాష్ట్రం లో మా కార్మికుల పట్ల జరుగుతున్నటువంటి పరిణామాలను క్లుప్తంగా వివరించారు. మానవ సమాజానికి అందమైన రాజ భవనాలు కట్టి మనకి కనీసం నీడ లేని పరిస్థితిలు ఈ రాష్ట్రం లో నెలకొంది ఉదయం నుంచి రాత్రి వరకు మన శక్తి సామర్థ్యాల తో నిర్మించిన భవనలే కదా మన సృష్టి ఈ మన సుదీర్ఘ పోరాటానికి ఒక మలుపు రావాలని రాష్ట్ర వ్యాప్తంగా గత 20 సంవత్సరాల నుంచి అనేక ఉద్యమ పోరాటాల ఫలితంగా 1996 చట్టం అని చెప్పుకోవచ్చు కానీ కార్మికుల సంక్షేమం కోసం ఇంకా పూర్తి స్థాయిలో ఫలితాలు దక్కక పోవడం గమనార్హం. 20 సంవత్సరాల ఉద్యమ పోరాటం లో ఎంతో మంది శ్రమ పడి రక్తం చిందించి అమరులై ప్రభుత్వం మీద వత్తిడి తీసుక రావడం లో ప్రధాన పాత్ర పోషిస్తు కార్మికులని చైతన్య పరుస్తూ 1996 చట్టం రావడానికి అనేక సందర్భాల్లో మీటింగు లు రాస్తా రోకో లు చేసి ప్రభుత్వం మెడలు వంచి చట్టాన్ని సాధించే దిశగా ఉద్యమం చేశాము అనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1996 చట్టాన్ని అమలు చేయడం జరిగింది కానీ గత 10 ఏళ్ల బి అర్ ఎస్ పాలనలో చట్టాన్ని నిర్వీర్యం చేయడం జరిగింది మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం మళ్ళీ మా జీవితల్లో ఒక నూతనోత్సాహం కలిగింది నిర్వీర్యం చేసిన చట్టాన్ని మళ్ళీ అవి ఇంప్లిమెంట్ చేయాలని ఆవేదనను వ్యక్తం చేస్తూ మా కార్మిక ల పక్షాన మీరు ఒక్కసారి అసెంబ్లి లో మా గోడును వినిపించాలని కోరారు.

అదృశ్యమైన ఆరేళ్ల బాలుడి ఆచూకీ గుర్తింపు..

- ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాలుడిని గుర్తించిన కేసముద్రం పోలీసులు



కేసముద్రం,నవంబర్16 (జనంసాక్షి) : స్థానికంగా అదృశ్యమైన ఆరేళ్ల బాలుని ఆచూకీని పోలీసులు కేవలం 12 గంటల్లో చాకచక్యంగా చేదించారు.వివరాల్లోకి వెళ్తే మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కుటుంబం ఉపాధి నిమిత్తం కేసముద్రం ప్రాంతానికి వచ్చి స్థానికంగా పనిచేస్తూ నివాసం ఉంటోంది.ఈ క్రమంలో కుటుంబంలోని ఆరేళ్ల బాలుడు కదరి రాయ్‌సింగ్‌ను తండ్రి మందలించడంతో బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు.బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు కేసముద్రం పోలీసులు అప్రమత్తమై బాలుడి ఆచూకీ కోసం మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.మూడు బృందాలు సమన్వయంతో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టి,అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తూ ముందుకు సాగాయి. పోలీసుల సమష్టి కృషి,చురుకైన చర్యల ఫలితంగా కేవలం 12 గంటల్లోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాలుడు కదరి రాయ్‌సింగ్ ఆచూకీని విజయవంతంగా గుర్తించారు. అనంతరం డీఎస్పీ తిరుపతిరావు,ఎస్.ఐ క్రాంతి కిరణ్,పీసీ మోహన్,రాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలుడిని అతని తండ్రికి క్షేమంగా అప్పగించారు. తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తిరిగి తండ్రి చెంతకు చేరడంతో కుటుంబ సభ్యులు ఊరట చెందారు. అదృశ్యమైన బాలుడి ఆచూకీని కేవలం 12 గంటల్లోనే గుర్తించి,సురక్షితంగా తండ్రికి అప్పగించడంలో చురుకైన పాత్ర పోషించిన కేసముద్రం పోలీస్ అధికారులు,సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. శబరీష్ అభినందించారు. బాలల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ గుర్తించేందుకు పోలీస్ శాఖ తక్షణ స్పందనతో, సమన్వయంతో పనిచేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్..



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 16 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లాలో నవంబర్ 22, 2026న నిర్వహించనున్న సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్ డే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని గ్రీవెన్స్ అనంతరం కలెక్టరెట్ లోని మెయిన్ కాన్ఫెరెన్స్ హాల్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి:గ్రామ స్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసి, పల్స్ పోలియో కార్యక్రమానికి ఒక రోజు ముందుగానే గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి. విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్: వ్యాక్సిన్ సామర్థ్యం దెబ్బతినకుండా, కోల్డ్ చైన్ వ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ: పల్స్ పోలియో కార్యక్రమం జరిగే రోజుల్లో అంగన్‌వాడీ టీచర్లు విధిగా పాల్గొనేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి. మున్సిపల్ శాఖ: పట్టణ ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సేవలను వినియోగించుకోవాలి.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ... పల్స్ పోలియో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరిస్తూ, జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.22 నవంబర్ న జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని.నవంబర్23, 24 ల్లో బూత్‌లకు రాని, పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి, మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు హనుమకొండ జిల్లాలో మొత్తం 0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు 84,654 మంది ఉన్నట్లు అంచనా వేయగా, వీరందరికీ పోలియో చుక్కలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 497 పల్స్ పోలియో బూత్‌లు, 12 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రామకాంత్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ సౌమ్య నాయక్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీకృష్ణారావు, డాక్టర్ రజిత, డాక్టర్ మురళి, డాక్టర్ జ్ఞానేశ్వర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్, రోటరీ క్లబ్ బాధ్యులు, మాస్ మీడియా అధికారి ప్రసాద్, సునీల్ జయంత్, తాహిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ఎల్కతుర్తి (జనంసాక్షి) : ఎల్కతుర్తిలో పార్టీ కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రారంభించారు. డిసిసి ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ హాసన్ పర్తి పిఏసిఎస్ చైర్మన్.పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి సర్పంచ్ గా ఫోరం అధ్యక్షులు పుళ్ళూరి శ్రీధర్ రావు ప్రజాప్రతినిధులు, ముప్పు మహేందర్ శ్రీకాంత్ సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేయాలనీ. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వేదికగా నిలవాలనీ ఈ సందర్భంగా అన్నారు.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పనిచేయాలనీ. మండల కాంగ్రెస్ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ తెలిపారు.

ఎస్సారెస్పీ కెనాల్‌పై చికెన్ వ్యర్థాలు..

- దుర్గంధంతో గీత కార్మికుల అవస్థలు



నల్లబెల్లి, నవంబర్ 16 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కెనాల్ పరిసరాలు చెత్తాచెదారం, చికెన్ వ్యర్థాల డంపింగ్‌తో దుర్గంధభరితంగా మారుతున్నాయి. కెనాల్ కట్టపై విధులు నిర్వహించే గీత కార్మికులు వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుళ్లిపోయిన చికెన్ వ్యర్థాల కారణంగా ముక్కు మూసుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కెనాల్‌పై చెత్తాచెదారం, చికెన్ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని గీత కార్మికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో గౌడ సంఘం అధ్యక్షుడు సట్ల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఎస్సారెస్పీ కెనాల్‌ను చెత్తాచెదారం, చికెన్ వ్యర్థాలు పడేసే ప్రాంతంగా మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కెనాల్‌లో వ్యర్థాలు వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రపరిచి గీత క

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 నవంబర్ 2026

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకటి శ్రీహరి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి వాకిటి శ్రీహరి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, దేశ వ్యాప్తంగా రాష్ట్రానికి మంచి గుర్తింపు వచ్చేలా జిల్లాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తూ, ప్రజలు, విద్యార్థులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేసి పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకటి శ్రీహరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎ. సోని బాలాదేవి తదితరులతో కలిసి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఖమ్మం మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి వాకటి శ్రీహరి మాట్లాడుతూ ఖేలో ఇండియా కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమం గురించి తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేసి, ప్రతి జిల్లాలో పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి కూడా హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పర్యవేక్షించాలని, చిన్నపాటి లోటుపాట్లకు కూడా అవకాశం లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశపు ప్రతిష్టాత్మక జాతీయ యువ క్రీడా సంబరమైన 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026కు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇస్తోందని తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు 12 రోజుల పాటు ఈ క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ సంస్థల జట్ల నుంచి యువ క్రీడాకారులు, సహాయక సిబ్బంది పాల్గొననున్నారని వివరించారు. ఖమ్మం జిల్లాలో ఆర్చరీ పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా వేదికలు, మౌళిక సదుపాయాలు, వసతి, రవాణా తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డివైఎస్ఓ టి. సునీల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనం సాక్షి) : ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఎస్సీ కాలనీకి చెందిన పి. వెంకన్న తనకు వినికిడి సమస్య ఉందని, సదరం సర్టిఫికెట్ జారీ చేసి వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీఆర్డీఓకు పంపిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన ముస్లిం ప్రతినిధులు తమ గ్రామంలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయని, అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 223/ఏలో ఉన్న 3 ఎకరాల 3 గుంటల ప్రభుత్వ భూమిలో ఒక ఎకరం కబ్రస్థాన్ కోసం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిపై తహసీల్దార్‌కు పంపిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. రామమూర్తి, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఒకే చోట 23 ఎకరాల భూమిని కేటాయించి, క్యాబినెట్ ఆమోదంతో జీవో జారీ చేశామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని, వివిధ రాజకీయ పక్షాలతో కలిసి తన సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం కలెక్టరేట్ ప్రారంభోత్సవ సభలో 4 లక్షల మంది సాక్షిగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అప్పటి మంత్రి హరీశ్ రావు, తాను ప్రత్యేక చొరవ తీసుకుని ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే (ఎస్సార్ గార్డెన్ వెనుక నుండి వెంకటాయపాలెం వరకు) 23 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. ఎన్నికల హామీలుగా దీనిని మళ్లీ వాయిదా వేయకుండా తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అప్పగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్-టీజేఫ్ ',అధ్యక్షులు చిర్రా రవి,ఆకుతోట ఆదినారాయణ, సాంబశివరావు, ప్రశాంత్, శ్రీనివాస్,నాయకులు ఖమర్, పగడాల నాగరాజు,పిన్ని కోటేశ్వరరావు,ఎండి పాషా, దడాల రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా



సూర్యాపేట, నవంబర్ 16 (జనంసాక్షి) : పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ఈ పథకాన్ని నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ఇందిరమ్మ కుటుంబ భీమా పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించడం పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న కుటుంబంలోని అర్హులైన సంపాదనపరుల్లో ఒకరిని బీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. నామోదు అనంతరం వివరాలను కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారంతో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

పేదల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



తుంగతుర్తి, నవంబర్ 16 (జనం సాక్షి) : పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు, సోమవారం మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్ లో తుంగతుర్తి, మద్దిరాల, నూతన కళు ళ మండలాలకు సంబంధించి చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన వారందరికీ నూతన పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలనలో ఒకవైపు రేషన్ కార్డుల కోసం మరోవైపు కొత్త పెన్షన్ల మంజూరు కోసం ప్రజలు ఎదురు చూశారని కానీ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కొత్త రేషన్ కార్డులతో పాటు కొత్త పెన్షన్ల పంపిణీ చేయటం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయి బాబా, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, ఎంపీడీవోలు చలపతి, సునీత, తాహసిల్దార్ దయానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేగటి రవి గౌడ్, వెంకన్న, మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గుడిపాటి సైదులు, జయసుధ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఆత్మ కమిటీ చైర్మన్ పానుగంటి నరసింహారెడ్డి, గ్రంధాలయ చైర్మన్ గంగరాజు యాదవ్,వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు, మూడు మండలాల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా పర్యటనకు రానున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

- ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనం సాక్షి) : కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 19న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఖమ్మం జిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఈ నెల 19న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నందున, కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించి ఈవెంట్ మేనేజర్ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించి, కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగానే ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని, ఆయా శాఖలకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హెలిప్యాడ్, రహదారుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను అవసరమైన ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు పర్యటన మార్గాల్లో రహదారులకు ఇరువైపులా అవసరమైన మరమ్మతులు, ఇతర



మౌళిక సదుపాయాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రామానుజం, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు, సంబంధిత శాఖల అధికారులు, జాతీయ రహదారుల శాఖ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సగరులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి

- జీవో 59ను సవరించి కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్లు పెంచాలి
- జిల్లా అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్



వనపర్తి, నవంబర్ 16 (జనం సాక్షి) : సగరులు అన్ని రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నందున వారిని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సగరుల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి బీసీ-ఏలో చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జీవో నంబర్ 59ను సవరించి ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో సగరులకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. సగరులను నిర్మాణ రంగ కార్మికులుగా గుర్తించి ఆరోగ్య భద్రత కార్డులు అందించడంతోపాటు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సగరుల వాస్తవ జీవన పరిస్థితులను ప్రభుత్వం పరిశీలించి, వారి అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ అధికారులకు జిల్లా సగర సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొబ్బూరి చంద్రయుడు, జిల్లా కోశాధికారి గుంటి సత్యం సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకా సత్యం సాగర్, రాష్ట్ర కోశాధికారి చీర్ల విష్ణు, గోల్డెన్ సిటీ ఆర్కే రవి సాగర్, మహిళా మాజీ అధ్యక్షురాలు మహేశ్వరి సాగర్, రాష్ట్ర నాయకుడు పెబ్బేరు శ్రీనివాసులు సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ముఖ్య సలహాదారు పల్లె సత్యనారాయణ, వనపర్తి పట్టణ అధ్యక్షుడు బుజ్జన్న, సంస్కృత విభాగం అధ్యక్షుడు నాగేంద్రం, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మాజీ లీగల్ అడ్వైజర్ సుజనా సగర, వనపర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చీర్ల శ్రీనివాసులు, మాజీ పట్టణ అధ్యక్షుడు పెద్దనాగులు, మరికుంట అధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాసులుతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సగర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ప్రారంభం



కల్లూరు, నవంబర్ 16 (జనం సాక్షి) : కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 2026...27 సంవత్సరం సీజనకు సంబంధించి చెరుకు క్రషింగును ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగుళ్ళ నాగేశ్వరరావు, ఫ్యాక్టరీ చీఫ్ ఇంజనీర్, వెంకటరత్నం సంయుక్తంగా స్విచ్ ఆన్ చేసి సోమవారం ప్రారంభించారు .తొలుత ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ నాగేశ్వరరావు ఫ్యాక్టరీ సివిల్ ఇంజనీర్ కొడాలి రఘునాథ్ బాబు, చీఫ్ ఇంజనీర్ వెంకటరత్నం పలువురు రైతు సోదరులు కార్మికులు ,ఫ్యాక్టరీ అధికారుల సమక్షంలో వేద పండితుల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పూజా ద్రవ్యములతో చెరుకు గడలను మిషనరీలలో వేసి క్రషింగ్ ప్రారంభించారు. ఈ ఏడాది సిజన్లో తమ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో కేవలం25 వేల టన్నులు చెరుకు క్రసింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈఏడాదిక్రషింగ్ సిజన్లో చెరుకు మద్దతు ధర టన్నుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎఫ్ ఆర్ పి ప్రకారం నువ్వేనా3,383రూపాయలకు అదనంగా ఫ్యాక్టరీ ప్రోత్సాహం కింద 117 రూపాయలు కలిపి మొత్తంగా టన్ను చెరుకుమద్దతుధర3,500రూపాయల చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేన్ మేనేజర్, విజయ రాజు, హెచ్ ఆర్ మేనేజర్ ఎలమంచిలి కుమార్ చంద్ర, అకౌంటెంట్ శ్రీనివాస్ స్టోర్స్ ఆఫీసర్ వేజెండ్ల శ్రీకాంత్, పలువురు ఫ్యాక్టరీ కార్మికులు , సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

నాడు కన్నీళ్లు.. నేడు ఆనంద భాష్పాలు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందిస్తాం
- ఇది నిజమైన దీపావళి.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



చంద్రుగొండ, నవంబర్ 16 (జనం సాక్షి) : పదేళ్లుగా పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి ఎదురుచూసిన అర్హులైన లబ్ధిదారులకు ఎట్టకేలకు చేయూత లభించడంతో వారి కళ్లలో ఆనందభాష్పాలు కనిపించాయి. పింఛన్ల మంజూరు పత్రాలు చేతికందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇది నిజమైన దీపావళి అని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం చంద్రుగొండ మండలం దామరచర్లలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో నిర్వహించిన ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను 494 మందికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండాలనే లక్ష్యంతో తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా అర్హత ఉండి పింఛన్లు మంజూరు కాని వారు మరోసారి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సీఐ లక్ష్మి, సీడీపీవో జ్యోతి, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు భోజ్య నాయక్, తుమ్మలపల్లి సురేష్, సారెపల్లి శేఖర్, ఫజల్ బక్షి, బుర్ర సురేష్, ఇమ్రాన్, వసీం పాషా, కిరణ్ రెడ్డి, కడియాల పుల్లయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు గానుగ ప్రారంభం

- రైతుల కోసమే నష్టాలను భరిస్తూ కర్మాగారం నిర్వహణ
- రైతుల శ్రేయస్సు కోసం సుదర్శన హోమం.. మాజీ ఎంపీ నామ



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లా రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో 2026-27 చెరకు గానుగ సీజన్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కర్మాగార వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన సతీమణి చిన్నమ్మతో కలిసి ఉదయం 9.54 గంటలకు చెరకు గడలను గానుగలో వేసి సీజన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గానుగ సీజన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం రైతులతో సమావేశమైన నామ మాట్లాడుతూ చక్కెర పరిశ్రమలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కర్మాగారం 26 ఏళ్ల నిర్వహణలో చక్కెర, కోజనరేషన్ విభాగాల్లో కలిపి నాలుగేళ్లు మాత్రమే లాభాలు వచ్చాయని, మిగిలిన 22 ఏళ్లు నష్టాలను భరిస్తూనే రైతుల ప్రయోజనాల కోసం కొనసాగిస్తున్నామని వెల్లడించారు. రైతులు, పరిశ్రమ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు. రైతులు, కర్మాగార సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కాంక్షిస్తూ సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఏవీపీ కోటయ్య, కుటుంబ సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, కర్మాగార అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనం సాక్షి కథనానికి అధికారుల తక్షణ స్పందన..

- కోయలపాడు చెరువులో 9 అక్రమ బోర్లు సీజ్
- వార్త ప్రచురితమైన గంటల్లోనే రంగంలోకి దిగిన యంత్రాంగం
- తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈ, పోలీస్, కరెంట్ శాఖల సంయుక్త ఆపరేషన్
- జానకిరామ్ రెడ్డికి చెందిన 3 బోర్లను కేసింగ్‌తో సహా జేసీబీలతో తొలగింపు
- మొత్తం 9 బోర్లు సీజ్ చేసి, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు
- జనం సాక్షి కథనానికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు





మాడుగులపల్లి, నవంబర్ 16 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కోయలపాడు గ్రామంలోని చెరువు శిఖం భూముల్లో అక్రమ బోర్ల తవ్వకంపై జనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఘాటు కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. వార్త వెలువడిన కొద్ది గంటల్లోనే తహసీల్దార్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు రంగంలోకి దిగి అక్రమ బోర్లపై కొరడా ఝుళిపించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కోయలపాడు చెరువు వద్దకు చేరుకున్న అధికారులు మొత్తం 9 అక్రమ బోర్లను సీజ్ చేసి, వాటి విద్యుత్ కనెక్షన్లను తొలగించారు.

జేసీబీలతో కేసింగ్‌లు తొలగింపు

ఈ సంయుక్త తనిఖీల్లో అధికారులు అత్యంత కఠినంగా వ్యవహరించారు. చెరువు భూముల్లో అక్రమంగా వేసిన జానకిరామ్ రెడ్డికి చెందిన 3 బోర్లను జేసీబీల సహాయంతో కేసింగ్ పైపులతో సహా పూర్తిగా బయటకు తీయించారు. అలాగే కట్టా కృష్ణారెడ్డికి చెందిన 2 బోర్లు, నర్సిరెడ్డి, అనంతరెడ్డి, మంత్రాల దశరథ రెడ్డి, సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలకు చెందిన ఒక్కో బోరు చొప్పున మొత్తం 9 బోర్లను అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా వినియోగిస్తున్న మోటార్లను బయటకు తీయడంతో పాటు, వాటికి ఉన్న కరెంట్ కనెక్షన్లను విద్యుత్ సిబ్బంది తక్షణమే తొలగించారు.

ఈ చర్యల్లో తహసీల్దార్ సరోజ పావని తో పాటు ఇరిగేషన్ ఏఈ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐ శ్యామ్, జీపీఓలు శ్రీను, ఇన్‌ఛార్జి రామారావు, విద్యుత్ శాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ చెరువు శిఖం భూములను ఆక్రమించి అక్రమంగా బోర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

రోజుల తరబడి నానుతున్న ఈ సమస్యపై జనం సాక్షి ప్రచురించిన కథనంతో అధికారులు వెంటనే స్పందించి అక్రమ బోర్లను తొలగించడంపై కోయలపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు తమ సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన జనం సాక్షి పత్రికకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17.11.2026



అటవీ భూమిని ఆక్రమణ..

వ్యక్తిపై కేసు నమోదు

సిరికొండ నవంబర్ 16 (జనంసాక్షి):రేంజ్ పరిధిలోని పందిమడుగు సెక్షన్లో బీట్ కంపార్ట్మెంట్ 482, లో హాక్కుపత్రాలు లేకున్నా గాని చెట్లను నరకడం, అడవికి నిప్పు పెట్టి, వన్యప్రాణులకు హాని తలపెట్టే విధంగా ప్రవర్తించిన పంది మడుగు గ్రామానికి చెందిన జరుపుల ప్రతాప్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిరికొండ రేంజ్ అటవీ శాఖ రేంజ్ అధికారి నర్సింగ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ కొందరు వ్యక్తిగత స్వార్థం కోసం, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణ సమస్యకు ఉపయోగపడే, అడవి నరకడం వంటి చర్యలకు పాల్పడితే అటవీ చట్టం ప్రకారం, వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎఫ్ ఆర్ ఓ నర్సింగరావు హెచ్చరించారు.

యాదవరాజును సన్మానించిన కిషన్‌లాల్ మిడ్డాజి..



గోదావరిఖని, జనంసాక్షి : నిఫా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే.యాదవరాజును హరియాణ విధాన సభ డిప్యూటీ స్పీకర్ కిషన్‌లాల్ మిడ్డాజి ఘనంగా సన్మానించారు. మహాభారత ఇతిహాస చరిత్రలో నిష్పులంకుడు, నిస్వార్థ రాజనీతి పరిజ్ఞానుడు సుపరిపాలనదక్షుడు,అంగరాజ్య పరిపాలనదీసుడు గొప్ప దానకర్త దానవీరశూరకర్ణ పేరు మీదుగా జరిగిన కరుణా ఉత్సవ్-2026 హర్యానాలోని కర్నాల్లో జరిగిన ఉత్సవాల్లో తెలంగాణ నీఫా రాష్ట్ర అధ్యక్షులు కే.యాదవ రాజును హర్యానా ప్రభుత్వ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ కృష్ణలాల్ మిడ్డా, ఓఎస్డి కిషన్‌కర్ణ, మినిస్టర్ ఆఫ్ మనోహర్‌లాల్ కట్టర్,కేంద్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గత 35 సంవత్సరాలుగా ఎనలేని సేవలందిస్తున్న,భవిష్యత్తు ఈనాటి బాలురు, యువత కోసం పనిచేస్తున్న యాదవరాజును అందరి సమక్షంలో మంగల్సేన్ పాండే ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు.కోవిడ్ సమయంలో 235 రక్తదాన శిబిరాలను నిర్వహించినందుకు గాను, తెలంగాణలోని 33 జిల్లాలలో ఉన్నటు యువతను సమాజ సేవకు ప్రేరేపిస్తూ,యువజన ఐకాన్ అవార్డుతో సన్మానించినందుకు యాదవరాజుకు సత్కారం చేశారు.ఎన్నెపి, నీఫా రాష్ట్ర కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు, అభిమానులు అభినందించారు.

22న హైదరాబాద్‌లో ఐవైఎం తెలంగాణ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



- యువతలో చైతన్యం, సామాజిక బాధ్యత
- పెంపొందించడమే లక్ష్యం..
- ఐవైఎం ప్రతినిధి సయ్యద్ అబ్దుల్లా హుస్సేన్..

గోదావరిఖని, జనంసాక్షి :
ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎం) తెలంగాణ రాష్ట్ర మహాసభను ఈ నెల 22వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నామని ఐవైఎం హైదరాబాద్ ప్రతినిధి సయ్యద్ అబ్దుల్లా హుస్సేన్ అన్నారు.గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐవీఎం అడ్హాక్ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు.రాష్ట్ర మహాసభకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి యువకులు,ఐవైఎం కార్యకర్తలు, సభ్యులు,వాలంటీర్లు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారన్నారు.యువతలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక చైతన్యం,దేశం పట్ల బాధ్యతను పెంపొందించడం,సమాజ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించేలా ప్రోత్సహించడం ఈ మహాసభ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.అనంతరం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ విలేకరుల సమావేశంలో హైదరాబాద్ ప్రతినిధి సయ్యద్ అబ్దుల్లా హుస్సేన్, జమాతె ఇస్లామీ హింద్ గోదావరిఖని ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్, ఐవైఎం కన్వీనర్ షేక్ మజహరుద్దీన్,కో-కన్వీనర్ ఖాజా మజహరుద్దీన్, జమాతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు మహమ్మద్ ఫయాజుద్దీన్,మహమ్మద్ ముస్తఫా,మహమ్మద్ అఫ్రోజ్, మహమ్మద్ అక్బర్, మహమ్మద్ మెహరాజ్, ఉజేర్, యాసర్ అరాఫత్, రెహాజుద్దీన్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 16(జనంసాక్షి) :
అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగుండం మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తాము గత 40 సంవత్సరాల క్రితం వీర్లపల్లి గ్రామం వద్ద వర్షం నీరు వెళ్ళుటకు రెండు పైపులతో నిర్మాణం చేశామని, పైపుల స్థానంలో బ్రిడ్జి నిర్మాణం చేసి సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం2 జనరల్ మేనేజర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం అల్లిపూర్ రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన మూట.రాధ తాను వికలాంగురాలునని తన భర్త ఎలుగు. కుమార్ తనను, తమ పిల్లల బాగోగులు చూసుకోవడం లేదని దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ సుల్తానాబాద్ కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సామ. తిరుపతి తాను దివ్యాంగుడినని చేయూత పథకం కింద కొత్త పెన్షన్ మంజూరు కోరుతూ దరఖాస్తు చేసుకోగా గ్రామీణ అభివృద్ధి అధికారి కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామానికి చెందిన దుబ్బాకుల. శారద తాను నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగురాలునని తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

బాలల హక్కుల పరిరక్షణ,బాలల భద్రత,సంక్షేమం పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు.సోమవారం చిల్డ్రన్స్ డే వీక్ వేడుకల్లో



భాగంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం (డి సి పి యు) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ప్రజావాణి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిగ్నేచర్ క్యాంపెయిన్, ఫోటో ఫన్ బూత్ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సిగ్నేచర్ క్యాంపెయిన్ లో పాల్గొని బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన సందేశంపై సంతకం చేశారు.అనంతరం ఫోటో ఫన్ బూత్‌ను ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలల హక్కులు, బాలల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన,బాల కార్మిక వ్యవస్థ నివారణ,బాలలపై హింస,వేధింపుల నిరోధం వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాలల రక్షణలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు.బాలల భద్రత,సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని, బాలల హక్కులకు భంగం కలగకుండా వారి రక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు.చిల్డ్రన్స్ డే వీక్ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సంక్షేమం,రక్షణ,హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి హెల్తీ 5 కే రన్ లో యువత,విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నవంబర్ 29, 2026 (ఆదివారం) నిర్వహించనున్న పెద్దపల్లి హెల్తీ రన్-5 కే కార్యక్రమంలో యువత, విద్యార్థులు,జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన ఛాంబర్‌లో పెద్దపల్లి హెల్తీ రన్ -5కే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఎస్ ఫర్ లైఫ్ సే-నాట్ టు డ్రగ్స్ అనే నినాదంతో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల పై కుటుంబ సభ్యులు,స్నేహితులు, సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.ఈ రన్ అండ్ వాక్ కార్యక్రమం ద్వారా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బలమైన సామాజిక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు,యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని కలెక్టర్ పేర్కొన్నారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్ పంపిణీ

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

తంగళ్ళపల్లి జనంసాక్షి:
తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి ఎస్ ఎస్ గార్డెన్ లో అర్హులకు చేయుత పెన్షన్ మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ కోసం ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ఆగస్టు 01తేదీ నుండి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామని వచ్చిన దరఖాస్తులను అధికారులతో విచారణ చేయించామని తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు .19వ తేదీన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. పెన్షన్ తీసుకునే వారిలో పనిచేసేంత ఆరోగ్యంగా ఉన్నవారు ఏదైనా ఆదాయం వచ్చే పనులు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. జిల్లా మొత్తం 8,209, తంగళ్ళపల్లి మండలంలో 802 నూతన పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేశామని వెల్లడించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇల్లు త్వరలో లబ్ధిదారులకు అందిస్తామని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు



కూడా ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల విలువైన బీమా వర్తిస్తుందని గ్రామాలు,మున్సిపల్ వార్డులలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు ఇవ్వాలని నెల రోజుల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డి ఆర్ డి ఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య, ఇన్చార్జి తాసిల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తోనే బంగారు భవిష్యత్తు

గోదావరిఖని, జనంసాక్షి :
ప్రపంచవ్యాప్తంగా సైక్లింగ్ క్రీడకు మంచి గుర్తింపు ఉందని..సైక్లింగ్ క్రీడతో బంగారు భవిష్యత్తు ఏర్పడుతోందని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు.సోమవారం హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ వెలోడ్రాంలో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ (సౌత్ ఇండియా జోన్) క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి.ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సైక్లింగ్ టీం పాల్గొని ప్రశంసలు అందుకుంది.కరీంనగర్ టీంను ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారతీయ రైల్వేలు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ శాఖ, వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో స్పోర్ట్స్ కోటా కింద నేరుగా ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. సైక్లింగ్‌కు సంబంధించిన రాష్ట్ర, జాతీయ స్థాయి సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ఉన్నత విద్యా కోర్సులలో ప్రత్యేక స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు



వర్తిస్తాయని పేర్కొన్నారు.తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌కాంతారావు, సైక్లింగ్ కోచ్ చంద్రారెడ్డి, మ్యాక్స్ వెల్ పెద్దపెల్లి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అసంపల్లి శ్రీనివాస్, సెక్రటరీ తగరపు శంకర్, కరీంనగర్ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సురభి వేణుగోపాల్, సుల్తానాబాద్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శారద తదితరులు అభినందించారు.



ఐకేపీ సెంటర్ ప్రారంభ కార్యక్రమానికి కార్పొరేటర్‌ను ఆహ్వానించకపోవడంపై..

పెద్దపల్లి కలెక్టర్‌కు ఫిర్యాదు..

గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 6వ డివిజన్ జనగామ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేసీ కేంద్రం ప్రారంభోత్సవంలో సమాచారం ఇవ్వలేదని కార్పొరేటర్ తోకల శ్యామల-రమేశ్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.దళిత కార్పొరేటర్‌ను అవమానించిన ఘటనపై ఫిర్యాదు చేశామని ఆమె తెలిపారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని ఆమె పేర్కొన్నారు.జనగామ గ్రామంలో ఐకెపి ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేయర్ మహంకాళి స్వామి ముఖ్యఅతిథిగా హాజర య్యారని తెలిపారు.స్థానిక కార్పొరేటర్‌కు ప్రారంభోత్సవ కార్యక్రమం గురించి ఎటువంటి సమాచారం అందించలేదని ఆమె పేర్కొన్నారు.6వ డివిజన్‌లోని జనగామ గ్రామంలో ప్రజలచే ఎన్నుకోబడిన దళిత మహిళా కార్పొరేటర్‌ను అవమానించిన అధికారులు,ప్రజాప్రతినిధులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని,వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే జిల్లాలో దళిత ప్రజాప్రతినిధుల పట్ల ఇటువంటి వివక్ష తిరిగి పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు.



ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై సమగ్ర విచారణ జరిపించాలి

- అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలి..
- ప్రజావాణిలో లింగంపల్లి గ్రామస్తుల సామూహిక ఫిర్యాదు

సదాశివనగర్, నవంబర్ 16 (జనంసాక్షి):
సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై నెలకొన్న వివాదానికి తెరదించాలని, అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని గ్రామస్తులు ప్రజావాణిలో డిమాండ్ చేశారు. సోమవారం సదాశివనగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సామూహిక ఫిర్యాదు అందజేసి, ఎంపిక ప్రక్రియపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.గత అక్టోబర్ 2న గ్రామసభలో ప్రత్యేక గ్రామసభ నిర్వహిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని గ్రామస్తులు ఆరోపించారు. నవంబర్ 15న జరిగిన గ్రామసభలోనూ ఎంపిక జాబితాలపై అధికారులను నిలదీశారు. కమిటీ సభ్యుల నుంచి తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారనే ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎంపికలో ఎమ్మెల్యే పేరు ప్రస్తావనకు రావడం, లబ్ధిదారుల జాబితాలు ఎక్కడి నుంచి వచ్చాయనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.గ్రామ కార్యదర్శి గ్రామసభలో వెల్లడించిన వివరాలు వీడియోలో రికార్డు అయ్యాయని, అవసరమైన ఆధారాలను విచారణ అధికారులకు అందజేస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎంపికైన మరియు తిరస్కరించబడిన వారి జాబితాలను బహిర్గతం చేయాలని కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సాందు బాలయ్య, బ్రహ్మచారి, హరీష్, బాబావ్య, గంగవ్వ, స్వామి, మ్యాకాల బాలయ్య, హనుమంతరావు, కిషన్‌రావు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ క్లబ్ ఎన్నికల్లో ఘన విజయం

- అభ్యర్థులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సన్మానం
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నూతన పాలకవర్గ సభ్యులు



హుజూరాబాద్, నవంబర్ 16 (జనంసాక్షి) :హుజూరాబాద్ క్లబ్ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. క్లబ్ సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, క్లబ్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అందరినీ కలుపుకొని క్లబ్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అభ్యర్థులు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని కలిసి, తమ విజయానికి అందించిన సహకారం, ప్రోత్సాహానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా హుజూరాబాద్ క్లబ్ ఎన్నికల్లో వైస్ చైర్మన్ గా పుల్లూరి ప్రభాకర్ రావు, సెక్రటరీగా కటుకూరి మల్లారెడ్డి, ట్రెజరర్ గర్రెపల్లి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా అనిల్ ఆకెనపల్లి, ధర్మారెడ్డి గడ్డం, నర్సారెడ్డి కేసిరెడ్డి, రాజిరెడ్డి మ్యాకల, శ్రవణ్ పొనగంటిలను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విజయం సాధించిన అభ్యర్థులందరినీ అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో హుజూరాబాద్ క్లబ్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రష్యాపై డ్రోన్ల వర్షం

శాంతి చర్చలు విఫలమైన రోజుల వ్యవధిలోనే ఈ దాడులు జరిగాయి. వైమానిక దాడుల్లో భాగంగా రష్యాను క్రిమియాతో అనుసంధానించే, ఐరోపాలోనే అత్యంత పొడవైన వంతెనపై ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది. దీంతో వంతెనపై రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని క్రిమియా గవర్నర్ వెల్లడించారు. కొన్ని నెలలుగా రష్యాతోపాటు క్రిమియా, నల్ల సముద్రం, అజోవ్ సముద్రంలోని లక్ష్యాలపై ఉక్రెయిన్ తన వైమానిక దాడులను ముమ్మరం చేసింది. రష్యా చమురుశుద్ధి రంగాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా విరుచుకుపడుతోంది. ఆ దేశ చమురు శుద్ధి సామర్థ్యంలో ఇప్పటివరకు 55 శాతానికిపైగా దెబ్బతీశామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి..

వృద్ధురాలి ఇంటిని భార్య పేరుపై మార్చుకున్న మరిది కొడుకు

- మార్ట్‌గేజ్‌లోన్ కూడా తీసుకున్న వైనం
- కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు

కరీంనగర్ టౌన్, నవంబర్ 15(జనంసాక్షి):
సంతానం లేని ఓ వితంతు వృద్ధురాలి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఆమె మరిది కొడుకు నకిలీ పత్రాలతో ఇంటిని కాజేసిన ఘటన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామంలో వెలుగుచూసింది. బాధితురాలు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం బయటపడింది.బాధితురాలు వేల్పుల రాధమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన రాధమ్మ భర్త బాలయ్య 2020 నవంబర్ 28న మరణించారు. వీరికి సంతానం లేకపోవడంతో రాధమ్మ ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో ఆమె మరిది కొడుకు వేల్పుల వెంకటేష్ ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, కొద్దిరోజులు ఇంట్లో ఉంటానని చెప్పి రాధమ్మ వద్ద చేరాడు. బాలయ్య మరణానంతరం బ్యాంకులో ఉన్న రూ.50 వేలు ఇప్పిస్తానని నమ్మబలికి, నిరక్షరాస్యురాలైన రాధమ్మ వద్ద పలు కాగితాలపై వేలిముద్రలు తీసుకున్నాడు. అంతేకాకుండా ఇంట్లోని నగదు, విలువైన వస్తువులు, ముఖ్యమైన పత్రాలను అపహరించాడు.ఇటీవల రాధమ్మ ఇంటి పన్ను చెల్లించేందుకు గ్రామ కార్యదర్శిని సంప్రదించగా, ఇల్లు ఆమె పేరుపై లేదని తేలింది. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నకలు తీసి పరిశీలించగా, వెంకటేష్ తన భార్య వేల్పుల శోభ పేరుపై ఇంటిని



అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు బయటపడింది. అంతటితో ఆగకుండా ఆ ఇంటిపై మార్ట్‌గేజ్ రుణం కూడా తీసుకున్నాడు. రాధమ్మ అనుమతి లేకుండా రెవెన్యూ కార్యాలయం నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సైతం పొందాడు. ప్రస్తుతం రాధమ్మనే ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధింపులకు గురిచేయడంతో పాటు, ఆమె తన అవసరాల నిమిత్తం సొంత భూమిని అమ్మకోగా కొనుగోలుదారులను బెదిరిస్తున్నాడు.ఈ వ్యవహారంపై గతంలో ప్రజావాణిలో (ఏప్రిల్ 20, మే 18 తేదీల్లో) ఫిర్యాదు చేయడంతో పాటు పోలీస్ కమిషనర్, ఏసీపీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులకు రాధమ్మ మొరపెట్టుకుంది. విచారణ జరిపిన అధికారులు వెంకటేష్ ఆమె కుమారుడు కాదని నిర్ధారించి, ఇంటి నుంచి పంపిస్తామని హామీ ఇచ్చినా నేటికీ చర్యలు తీసుకోలేదు. నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి మోసానికి పాల్పడిన వెంకటేష్‌తో పాటు ఇందుకు సహకరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితురాలు కలెక్టర్‌ను వేడుకుంది.

ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందన..

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు..

గోదావరిఖని, జనంసాక్షి : ప్రజల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్-డే కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్,సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా,పారదర్శకంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యత ఇవ్వాలని,ఎలాంటి జాప్యం, అలసత్వానికి తావులేకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 నవంబర్ 2026

డేటింగ్ యాప్‌తో వల.. బీరులో మత్తుమందు కలిపి దోపిడీ

- ఐదుగురు సభ్యుల ముఠా అరెస్టు
- 35 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం



మల్కాజిగిరి నవంబర్ 16 (జనం సాక్షి) : ఆన్‌లైన్ డేటింగ్ యాప్ వేదికగా పరిచయాలు పెంచుకుని, ఒంటరిగా ఉండే వ్యక్తుల ఇళ్లకు వెళ్లి బీరులో మత్తుమందు కలిపి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు 35 తులాలు (351 గ్రాములు) బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు వైద్యుడు కావడం గమనార్హం.మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను మల్కాజిగిరి కమిషనర్ సుమతి సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన తేజావత్ సంతోష్ (25), కర్నూలు జిల్లాకు చెందిన వైద్యుడు రెడ్డిగారి దినేష్ కుమార్ రెడ్డి (32) హైదరాబాద్ బాలానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరు మొయినాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మొహమ్మద్ ఆరిఫ్ (24), ఖమ్మం జిల్లా ఆరేకోడు తండాకు చెందిన విద్యార్థులు బానోతు విద్యాసాగర్ (21), బానోతు కార్తీక్ (18)లతో పాటు పరారీలో ఉన్న చందుతో కలిసి ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిందితులు 'గ్రైండర్' డేటింగ్ యాప్‌లో నకిలీ ఖాతాలు తెరిచి, చాటింగ్, వీడియో కాల్స్ ద్వారా బాధితులకు దగ్గరయ్యేవారు. మాటల్లో పెట్టి వారి ఆర్థిక స్థితిగతులు, ఒంటరిగా ఉంటున్నారా లేదా, ఇంట్లో బంగారు ఆభరణాలు ఉన్నాయా అనే వివరాలను సేకరించేవారు. నమ్మకం కుదిరాక, నేరుగా కలుద్దామంటూ బీరు బాటిళ్లతో బాధితుల ఇళ్లకు వెళ్లేవారు. అక్కడ ఒకరు మాటల్లో పెట్టి దృష్టి మళ్లించగా, మరొకరు బీరులో మత్తుమందు కలిపేవారు. బాధితులు స్పృహ కోల్పోగానే వారి ఒంటిపై, ఇంట్లో ఉన్న బంగారు గొలుసులు, ఉంగరాలు, ఇతర విలువైన వస్తువులను దోచుకుని ఉడాయించేవారు.ఇటీవల ఉప్పల్, కుషాయిగూడ, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మూడు కేసుల దర్యాప్తులో భాగంగా ఉప్పల్, కుషాయిగూడ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక ఆధారాలతో సోమవారం ఉదయం ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ముగ్గురిని, ఏఎస్ రావు నగర్ వద్ద మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా. మల్కాజిగిరి పరిధిలో 3, సైబరాబాద్ పరిధిలో జీడిమెట్ల, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, బాచుపల్లి 7, హైదరాబాద్ పరిధిలో మెహదీపట్నం, సనత్‌నగర్, బోరబండ 3, విశాఖపట్నంలోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, మొత్తం 14 కేసులతో సంబంధం ఉన్నట్లు నిందితులు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు చందు కోసం గాలిస్తున్నామన్నారు. నిందితుల నుండి 35 తులాల బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. కేసులు చేదించిన పోలీసులకు రివార్డులు అందజేశారు.డేటింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే అపరిచితులను గుడ్డిగా నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

అభాగ్యులకు పెన్షన్ కొండంత భరోసా

- తాండూరులో 1,100 మందికి మంజూరు పత్రాల పంపిణీ
- ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



తాండూరు, నవంబర్ 16 (జనంసాక్షి): అపరోధాల మధ్య జీవిస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుపేదలకు పెన్షన్ కొండంత భరోసానిస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణానికి చెందిన సుమారు 1,100 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెన్షన్ కేవలం నెలవారీ ఆర్థిక సహాయం మాత్రమే కాదని, పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు కల్పించే సామాజిక భరోసా అని పేర్కొన్నారు. ఈ నెల 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు, అదే రోజు అర్హులైన పెన్షన్ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తూ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 5 వేల మందికి పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. అర్హత ఉండి పెన్షన్ పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తాండూరు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కాగ్నా నుంచి తాగునీటి సరఫరా, మాస్టర్ ప్లాన్ అమలు, చిలుకవాగు, గొల్లచెరువు అభివృద్ధితోపాటు హైదరాబాద్ రోడ్డు, అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ఐమాక్స్ లైట్ల ఏర్పాటు చేపడుతున్నట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నామని పేర్కొన్నారు. పెన్షన్ల మంజూరులో రాజకీయ ఒత్తిళ్లు, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనిత, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, కమిషనర్ రాకేష్, తహసీల్దార్ తారాసింగ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమరశంఖం

డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె

- రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలి
- ఎన్నికల హామీలు అమలు చేయాలి
- ప్రజావాణిలో కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేత
- మేడ్చల్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16 (జనంసాక్షి) : ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మేడ్చల్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ల సాధన కమిటీ (సీఐటీయూ, బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ) పిలుపు మేరకు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి, ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర అశోక మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత 20 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 వేల మంది ఆశా వర్కర్లు ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్నారని ఎర్ర అశోక్ పేర్కొన్నారు. గర్భిణుల సంరక్షణ, ప్రసవాలు, వ్యాక్సినేషన్, పల్స్ పోలియో, సీజనల్ వ్యాధుల నివారణతో పాటు కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని తెలిపారు.

20 ఏళ్ల సేవకు రూ.9,900 పారితోషికమేనా?

రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలి : అనిత, రేవతి కళ్యాణి

గత 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు నేటికీ కనీస వేతనం అమలు చేయకుండా, కేవలం రూ.9,900 పారితోషికం మాత్రమే చెల్లించడం బాధాకరమని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అనిత, రేవతి కళ్యాణి లు అన్నారు. ఐదేళ్లుగా పారితోషికాలు పెంచకపోవడంతో పెరుగుతున్న ధరల మధ్య ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలని, రెండో పీఆర్సీలో రూ.30 వేల కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి డీఏ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రూ.50 లక్షల ఆరోగ్య, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. రిటైర్మెంట్ సమయంలో రూ.5 లక్షల ప్రయోజనంతో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, శిక్షణ పూర్తి చేసిన వారికి పదోన్నతులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఏడాదికి 20 రోజుల క్యాజువల్ లీవులు, ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి, పద్మ, లలిత, సబియా, వసంత, కోమలత, యాదమ్మ, ప్రవీణ, దేవిక, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, లింగస్వామి, రాజశేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానియొద్దు : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

- ఎల్‌నినో కార్యాచరణ సిద్ధం చేయాలి
- పలు శాఖల అధికారులకు ఆదేశాలు



రంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాగునీటి సరఫరా, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక శాఖలు, ఉపాధి హామీ పనులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నీటి సరఫరాలో అంతరాయాలున్న గ్రామాలు, ఆవాసాలను గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చోట పాత బోర్లకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్త బోర్లు వేయడం, ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పటికీ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్లాన్-ఏ, ప్లాన్-బి, ప్లాన్-సి విధానంలో కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యాత్మక ఆవాసాల వివరాలతో వచ్చే వారం సమీక్షకు హాజరుకావాలని సూచించారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద కూలీలకు గరిష్ఠంగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి శనివారంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పశుగ్రాస సాగుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రానున్న రబీ సీజన్‌లో రైతులు పంటల ఎంపిక విషయంలో శాస్త్రీయ అవగాహనతో నిర్ణయం తీసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు మార్గదర్శనం చేయాలని సూచించారు. రైతుల వద్ద ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంట కాలపరిమితిని పరిగణనలోకి తీసుకొని పంటల సాగుపై సూచనలు ఇవ్వాలన్నారు. 90 నుంచి 120 రోజుల వరకు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని రైతులకు సలహాలు అందించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, పిడి డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఉద్యానవన శాఖ అధికారి సురేశ్, పిడి మెప్మా వెంకట నారాయణ, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్ రావు, గ్రౌండ్ వాటర్ అధికారి మాధవ రావు, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: సీఎంసీ కమిషనర్ డాక్టర్ సృజన

- టౌన్ ప్లానింగ్ విభాగానికే అత్యధికంగా 26 ఫిర్యాదులు
- ప్రతి ఫిర్యాదుకు గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్



శేరిలింగంపల్లి, నవంబర్ 16 (జనం సాక్షి):
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జి.సృజన హాజరై ప్రజల నుంచి 32 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.అందిన ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 26, ఇంజినీరింగ్ విభాగానికి 3, పారిశుధ్య విభాగానికి 2, ఎలక్ట్రికల్ విభాగానికి ఒకటి చొప్పున ఉన్నాయి. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించినట్లు అధికారులు తెలిపారు. తద్వారా అర్జీదారులు తమ ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి వేదిక ఉపయోగపడుతోందని కమిషనర్ తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఫిర్యాదుపై బాధ్యతగా స్పందించాలని, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
మరోవైపు శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు ఎవరూ హాజరుకాలేదు. అయితే టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు. దీనికి గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ అనుసంధానించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

నిలిపి ఉంచిన రైలు బోగీల్లో చెలరేగిన మంటలు - దట్టంగా వ్యాపించిన పొగ



కాప్రా, నవంబర్ 16 (జనం సాక్షి) : చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలో నిలిపి ఉంచిన స్పేర్ రైలు బోగీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేగింది. మంటలు వేగంగా వ్యాపించడంతో బోగీల నుంచి పెద్దఎత్తున దట్టమైన పొగ వెలువడింది. మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు స్థానికులను ఆందోళనకు గురిచేశాయి. వెంటనే అప్రమత్తమైనా ఆర్పిఎఫ్ సిబ్బంది స్టేషన్ పరిధిలో అందుబాటులో ఉన్న నీటితో మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదం ఎలా సంభవించింది ఎన్ని బోగీలకు మంటలు వ్యాపించాయి ఎంత మేర ఆస్తి నష్టం జరిగింది అనే వివరాలు తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు, నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. విషయం తెలుసుకున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పిఎఫ్) ఐజి ఠాకూర్, డీఐజీ సురేష్ బాబు, ఆర్పిఎఫ్ సిఐ రాకేష్ లు సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకొని సంఘటనకు గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

వెంకటాపురం కల్వర్టు వద్ద చెత్త డంపింగ్ తొలగించాలి

అల్వాల్, (జనంసాక్షి): వెంకటాపురం కల్వర్టు చెత్త డంపింగ్ కేంద్రంగా మారడంతో పాదచారులు, వాహనదారులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తోట లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. పరిసర కాలనీల వాసులు, స్థానిక నాయకులతో కలిసి కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్తను ఆయన పరిశీలించారు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, గణేష్ గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీ నూతన ఎండీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్ కుమార్..



ముషీరాబాద్ నవంబర్ 16 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నూతన వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ బస్ భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల (ఈడీలు) తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆపరేషన్స్, ప్రయాణికులకు అందుతున్న రవాణా సదుపాయాలు, కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి సంస్థను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన, నాణ్యమైన ప్రయాణ సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రయాణికుల ఆదరణను మరింత పెంచుకోవాలని, టీమ్ వర్క్‌తో పనిచేసి టీజీఎస్ ఆర్టీసీని దేశంలోనే అగ్రగామి రవాణా సంస్థగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఏడాదిలోపు వికారాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు
- ఇప్పటివరకు నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు
- రెండు మూడు రోజుల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు
- ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ. అర్హులందరికీ అందిస్తాం
- చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ధారూర్,నవంబర్ 16(జనంసాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ శాసనసభ స్పీకర్,వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.ధారూర్ మండల కేంద్రంలోని ఎస్.ఆర్.ఫంక్షన్ హాల్‌లో ధారూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ...గత ప్రభుత్వ హయాంలో కొత్త పెన్షన్లు మంజూరు కావాలంటే అనేక ఇబ్బందులు ఎదురయ్యేవని,ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను ఎక్కడా నిలిపివేయకుండా అభివృద్ధి కార్యక్రమాలను సైతం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.గత ప్రభుత్వ అప్పులకు పడ్డీలు చెల్లించాల్సి వస్తున్నప్పటికీ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.ఇప్పటివరకు వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.రాబోయే ఏడాదిలోపు నియోజకవర్గంలోని అన్ని మండలాలు,అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపడతామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.మరో రెండు మూడు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని కూడా అమలు చేయబోతోందని తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఇందిర మ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.రేషన్ కార్డులు పొందని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని,అర్హత ఉన్న వారికి రేషన్ కార్డులు అందజేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుధీర్ కుమార్,మాజీ జెడ్పీటీసీ రాములు,మాజీ పిఏసీయస్ హన్మంత్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి నర్సింలు, తాసిల్దార్ షాజిదాబేగం, ధారూర్ మండల కాంగ్రెస్ నాయకులు,ధారూర్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ వార్డు మెంబర్ దావూద్, నర్సాపూర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి కాశిరామ్. కార్యకర్తలు,లబ్ధిదారులు,ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చేతులెత్తేసిన టౌన్ ప్లానింగ్

- మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్లలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- అక్రమ నిర్మాణాలను పట్టించుకోను ఇన్‌ఛార్జ్ అధికారి మేఘన
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు



మల్కాజిగిరి నవంబర్ 16 (జనం సాక్షి) : మల్కాజిగిరి, మౌలాలి జంట సర్కిళ్ల పరిధిలో విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి మరోసారి బట్టబయలైంది. పాత భవనాలపై నిబంధనలకు విరుద్ధంగా కొత్త నిర్మాణాలు, అదనపు అంతస్తులు, అక్రమ షెడ్ ల నిర్మాణం,ఎలాంటి అనుమతులు లేని కట్టడాలు జంట సర్కిళ్లలో జోరుగా సాగుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ ఆదాయానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొడుతూ, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ అక్రమ కట్టడాలపై మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఇన్‌ఛార్జ్ అధికారి మేఘనను వివరణ కోరగా, తనకు ఎలాంటి సంబంధం లేదని బాధ్యతల నుంచి తప్పుకునేలా వ్యాఖ్యానించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. తాను కేవలం రెండు సర్కిళ్లకు ఇన్‌ఛార్జ్‌గా మాత్రమే వ్యవహరిస్తున్నానని, ఆన్‌లైన్‌లో భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయడం వరకే తన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో జరిగే ఇతర విషయాలను తాను పట్టించుకోనని, కీసర, మౌలాలి, మల్కాజిగిరి సర్కిల్ లో నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న ఫైళ్లను క్లియర్ చేయడంలోనే టైం సరిపోతలేదని అన్నారు.జంట సర్కిల్ లలో జరిగే అక్రమ నిర్మాణాలను తన పై అ

జర్నలిస్టులకు పింఛన్ భరోసా కల్పించాలి

- ప్రకటనల ఆదాయంలో 10 శాతం సంక్షేమ నిధికి కేటాయించాలి
- ప్రభుత్వ వాటాగా మరో 3 శాతం ఇవ్వాలి
- ప్రజావాణిలో డీఆర్ఓకు టీఎస్జేయూ వినతి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16 (జనంసాక్షి) : జర్నలిస్టులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రత్యేక పింఛన్, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్జేయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జర్నలిస్టుల సామాజిక భద్రతకు శాశ్వత భరోసా కల్పించేలా సమగ్ర పింఛన్ పథకాన్ని అమలు చేయాలని కోరింది. ఈ మేరకు ఎన్యూజే (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్ఓ మాలతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెరుగు చంద్రమోహన్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పత్రికలు, స్థానిక మీడియా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టులకు వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. వారి సేవలకు గుర్తింపుగా జీవితాంతం ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

టీఎస్జేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ప్రకటనల ద్వారా మీడియా సంస్థలకు వచ్చే అర్హత కలిగిన ఆదాయంలో 10 శాతం జర్నలిస్టుల పింఛన్, సంక్షేమ నిధికి కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 3 శాతం నిధులు సమకూర్చాలని సూచించారు. ఈ నిధులతో జర్నలిస్టులకు శాశ్వత ఆర్థిక భద్రత కల్పించవచ్చన్నారు. టీఎస్జేయూ రాష్ట్ర నాయకుడు, చాప రవీందర్ మాట్లాడుతూ.. పింఛన్ నిధి నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి, ఏటా ఆడిట్ నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులతోపాటు, పదవీ విరమణ చేసిన వారికి కూడా పథకం వర్తింపజేయాలన్నారు. పింఛన్ అర్హతలు, మొత్తాన్ని నిర్ణయించేందుకు సీనియర్ సంపాదకులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మీడియా సంస్థల పరిమాణం, జర్నలిస్టుల సంఘాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు.

ఈ ప్రతిపాదనలను పరిశీలించి ముఖ్యమంత్రి, సంబంధిత ప్రభుత్వ శాఖలకు సిఫారసు చేయాలని డీఆర్ఓను విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘాలకతీతంగా సమిష్టి పోరాటం చేస్తామని, ప్రతి జర్నలిస్టుకు సామాజిక భద్రత కల్పించడమే తమ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్జేయూ) నాయకులు బివిఎస్ చలపతి నాయుడు, పలుగుల పవన్, బుడంపల్లి నిరంత గౌడ్, ఎం.విష్ణు మోహన్, వెంకటాపురం రవి తదితరులు పాల్గొన్నారు.

జూదం స్థావరంపై పోలీసుల దాడి..

- రూ.9.30 లక్షలు స్వాధీనం



రాజేంద్రనగర్, నవంబర్ 16 (జనంసాక్షి) : మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కెకెకె మా ఫుర్ ఫార్మ్ హౌస్‌లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు జరిపి ఐదుగురు నిందుతులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం సోమవారం వట్టేపల్లి, గుంటల్ షా బాబా దర్గా సమీపంలోని కేకేకే మా ఫుర్ ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న అక్రమ పేకాట స్థావరంపై దాడి చేశామని, ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారయ్యారు. నిందితుల నుంచి రూ.9,30,620 నగదు, 6 సెల్‌ఫోన్లు, 6 సెట్ల పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన నిందితులు ఖదీర్, షీలా అలియాస్ సామ్, మోత్కూరి నర్సింహ, మహమ్మద్ అస్లాం, మహమ్మద్ జమీల్, ఇన్నా రెడ్డి, శేఖర్ బాబు, మీర్జా, యూసుఫ్‌లుగా పోలీసులు గుర్తించారు. ఫామ్‌హౌస్‌లో కొంతకాలంగా డబ్బులతో పేకాట నిర్వహిస్తూ, నిర్వాహకుడికి 10 శాతం కమీషన్ చెల్లిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



మల్కాజిగిరి, నవంబర్ 16 (జనం సాక్షి) : ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం నేలమట్టం చేశారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని మల్కాజిగిరి కమిషనరేట్ వెనుక భాగంలో గల సర్వే నంబర్ 278లో ప్రభుత్వ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది.ఈ విషయంపై స్పందించిన మల్కాజిగిరి తహసీల్దార్ ఆదేశాల మేరకు, గిర్దావర్ పరమేష్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ వెలిసిన అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో పూర్తిగా కూల్చివేశారు. ఈ సందర్భంగా గిర్దావర్ పరమేష్ మాట్లాడుతూ. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



రంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి) : ప్రజారోగ్య పరిరక్షణలో వెన్నెముకగా నిలుస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి జగదీష్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.18,000 వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. కవిత అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆరోగ్య పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పని భారంతో నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ, కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 15వ తేదీన నిర్వహిస్తున్న ఆశా వర్కర్ల సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిల్లా నాయకులు సత్యనారాయణ, జగన్, ఆశా యూనియన్ జిల్లా నాయకులు నీరజ, శోభ, లక్ష్మీ రాణి, లత, శ్రీలత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



కొల్చారం, నవంబర్ 16 (జనం సాక్షి) : అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి, కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన 44 మంది అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తగా 'చేయూత' పెన్షన్లను మంజూరు చేసింది. ఈ మేరకు మంజూరైన పెన్షన్లకు సంబంధించిన అధికారిక ప్రొసీడింగ్స్ కాపీలను గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఘనంగా అందజేశారు. కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యంగారి గోవర్ధన్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జోగిపేట ఉపేందర్‌లు మాట్లాడుతూ.. గతంలో పెన్షన్ల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన పేదలకు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరిగిందని అన్నారు. పేదల కష్టాలను గుర్తించి, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి చేయూతనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పోతంశెట్టిపల్లి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, గ్రామంలో పెన్షన్ల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి , మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా అర్హులైన మిగిలిన పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని వారు భరోసా ఇచ్చారు. ప్రొసీడింగ్స్ కాపీలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్చన్నపల్లి శ్రీరామ్, గ్రామ సర్పంచ్ మోహన్, గ్రామ కార్యదర్శి శ్రీదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధరణి కాలనీ సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్‌కు వినతి



బోడుప్పల్, నవంబర్ 16 (జనంసాక్షి) : మేడిపల్లి డివిజన్ పరిధిలోని ధరణి కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించి కాలనీవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కాలనీవాసులతో కలిసి అధికారిని కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించి,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో వివరించిన ఆయన, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.కాలనీవాసుల వినతిపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్, సమస్యల పరిష్కారానికి అవసరమైన పనులను మంజూరు చేసి, సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ చింతం,జనరల్ సెక్రటరీ బీమిడి శ్రీనివాస్ రెడ్డి,తిరుమల్ రెడ్డి,శేఖర్ గౌడ్,సతీష్, అయిలయ్య యాదవ్, మహేశ్వరప్ప, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ప్రమాదాలను నివారించాలి

- వీధి దీపాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు



యాచారం, నవంబర్ 16 (జనం సాక్షి) : ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తక్షణమే వీధి దీపాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ యాచారం మండలం నంది వనపర్తి కి చెందిన గోరటి వెంకటేశం సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే సర్వీస్ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పొడవునా వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి, తెల్లవారుజామున చిమ్మచీకటి అలుముకుని వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు, వేగ పరిమితులు, పదునైన మలుపులు, దిశలను చూపే సూచిక బోర్డులు చాలాచోట్ల లేకపోవడం, ఉన్నవి చెట్ల చాటుకు దాగిపోవడం లేదా పాడైపోవడంతో వాహనదారులు ప్రమాదాలను గుర్తించలేక అదుపుతప్పి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఎంతోమంది అమాయకులు బలవుతున్న నేపథ్యంలో హెచ్ఎండీఏ , ఐఆర్బీ , పోలీస్, రోడ్డు రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించి సర్వీస్ రోడ్డులోని చీకటి ప్రాంతాల్లో ఎత్తైన స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. చెట్ల కొమ్మలను తొలగించి స్పష్టంగా కనిపించేలా రేడియం హెచ్చరిక బోర్డులను పునరుద్ధరించాలని, అలాగే ఇటీవల ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల వివరాలను వెల్లడించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ఈ సర్వే లక్ష్యం

- జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి



మొయినాబాద్, నవంబర్ 16 (జనం సాక్షి) : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే భూ భారతి రీ సర్వే లక్ష్యమని, ఇందుకోసం ప్రతి రైతు, భూ యజమాని అధికారులకు సహకరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. సోమవారం మొయినాబాద్ మండలం మోత్కుపల్లి గ్రామంలో సర్పంచ్ సంపూర్ణ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ వివాదాలకు రీ సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రోడ్ల నిర్మాణం కోసం రైతులు భూములు ఇచ్చిన అంశాలను పాత రికార్డుల ఆధారంగా పరిశీలించి న్యాయం చేస్తామని, సర్వే ప్రక్రియలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులకు గ్రామస్తులు సహకరించాలని తహసీల్దార్ గౌతమ్ కుమార్, ఎంపీడీవో హిమబిందు కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ జలజ, ఆస్ఐలు రాజేష్, వీణాకుమారి, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



యాలాల, నవంబర్ 16 (జనం సాక్షి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాండూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు హైదరాబాద్ రోడ్డు మార్గంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు డ్రగ్స్ దుష్ప్రభావాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యాలాల ఎస్సై-2 రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, వాటి వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని, ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్యానల్ న్యాయవాది జిలాని మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం, విక్రయాలు చట్టవిరుద్ధమైన చర్యలని, వీటికి పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని వివరించారు. డ్రగ్స్ నిర్మూలనతో ఆరోగ్యకరమైన సమాజం, దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే 1908 లేదా 112 హెల్ప్‌లైన్ నంబర్లకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ జిల్లా కోఆర్డినేటర్ మహమ్మద్ జహీర్, పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది ఫాతిమా, న్యాయవాదులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణం

- 150 గజాల స్థలం ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు..
- ఫిర్యాదులు చేసినా ఆగని పనులు
- తహసీల్దార్ ఆదేశాల అమలుపై అనుమానాలు..
- క్షేత్రస్థాయి అధికారుల తీరుపై విమర్శలు
- ప్రభుత్వ భూముల కబ్జాలను సహించేది లేదు..
- నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం
- ఎమ్మార్వో వెంకట నర్సింహారెడ్డి

బోడుప్పల్, నవంబర్ 16 (జనంసాక్షి) : ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ప్రభుత్వం పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆక్రమణల ఆరోపణలు వెలుగులోకి వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నారంటూ ఫిర్యాదులు అందినా పనులు కొనసాగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

వివరాల్లోకి వెళితే.. మేడిపల్లి మండలం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ నగర్ ఫేజ్-2లో సర్వే నంబర్లు 63/28 నుంచి 63/39 వరకు ఉన్నట్లు పేర్కొంటున్న ప్రభుత్వ భూమిలో సుమారు 150 గజాల స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ చిన్నపాటి నిర్మాణం చేపట్టి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించగా, అది అక్రమ నిర్మాణమని అధికారులు కూల్చివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం గతంలో ఉన్న నిర్మాణాన్ని సాకుగా చూపుతూ అదే ప్రాంతంలో మళ్లీ ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారంటూ సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ పనులు కొనసాగుతుండటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణాన్ని పరిశీలించి, భూమి స్వభావాన్ని నిర్ధారించాలని కోరుతున్నారు.

తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరా..?

ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయికి వెళ్లిన జీపీఓ, ఆర్ఐలు పరిస్థితిని పరిశీలించినట్లు సమాచారం. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందినప్పుడు పనులను నిలిపివేసి, రెవెన్యూ రికార్డుల ఆధారంగా విచారణ చేపట్టాల్సిన అధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది నివేదిక ఏమిటి? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కూల్చివేసిన నిర్మాణం, ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణం మధ్య సంబంధం ఏమిటి? స్థలానికి సంబంధించి పట్టా లేదా ఇతర అనుమతులు ఉన్నాయా? సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ రికార్డులు ఏమి చెబుతున్నాయి? క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అధికారులు ఉన్నతాధికారులకు ఎలాంటి నివేదిక సమర్పించారు? అనే అంశాలను తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.



జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లు తక్షణమే స్పందించి సర్వే నంబర్లు 63/28 నుంచి 63/39 వరకు ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, స్థలానికి సంబంధించిన రికార్డులు, నిర్మాణ అనుమతులను పరిశీలించాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం నిర్మాణాన్ని తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత సిబ్బందిపై కూడా శాఖాపరమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కబ్జాలను సహించేది లేదు: ఎమ్మార్వో

బోడుప్పల్‌లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణకు పాల్పడి ఇంటి నిర్మాణం చేపడుతున్నారనే సమాచారం తన దృష్టికి వచ్చిందని మేడిపల్లి మండల తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. వెంటనే సిబ్బందిని పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిస్తామని, ఆక్రమణలు ఉన్నట్లు తేలితే వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే సహించేది లేదని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 నవంబర్ 2026

తెలంగాణ ఆర్టీసీ నూతన వీసీ అండ్ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్ కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నూతన వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బస్ భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సిహెచ్. వెంకన్న, ఎం.రాజశేఖర్, సాలోమాన్ రాజ్, ఖుర్షో షా ఖాన్, ఏ.శ్రీధర్, ఫైనాన్షియల్ అడ్వైజర్ విజయపుష్ప లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆపరేషన్స్, ప్రయాణికులకు అందుతున్న రవాణా సదుపాయాలు, కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి సంస్థను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన, నాణ్యమైన ప్రయాణ సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రయాణికుల ఆదరణను మరింత పెంచుకోవాలని, టీమ్ వర్క్‌తో పనిచేసి టీజీఎస్ఆర్టీసీని దేశంలోనే అగ్రగామి రవాణా సంస్థగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మక్తల్‌లో అంతర్జాతీయ స్థాయి స్టేడియం

మంత్రి వాకిటి శ్రీహరి





మక్తల్, నవంబర్ 6 (జనంసాక్షి) : క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మక్తల్ పట్టణంలో మినిస్టర్ కప్ 2026-27 సీజన్-1 క్రికెట్ పోటీలను మంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మక్తల్‌కు గతంలో ఉన్న క్రీడా ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తామని తెలిపారు. రూ. 25 కోట్ల వ్యయంతో మక్తల్‌లో ఆధునాతన స్టేడియంను నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో దీనిని అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. ప్రతి మండలంలోనూ క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. క్రీడారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 600 కోట్లు కేటాయించిందని మంత్రి వెల్లడించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లను 5 శాతానికి పెంచినట్లు తెలిపారు. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన చికితరావు ప్రయాణం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రీడాకారులు తమ లక్ష్యంపైనే పూర్తి ఏకాగ్రత ఉంచి, పట్టుదల, క్రమశిక్షణతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సాధికారత, పేదల సంక్షేమమే లక్ష్యం

మహిళా సాధికారత, పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, యువజన సర్వీస్ల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. సోమవారం మక్తల్ పట్టణంలోని ద్వారక ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి చేయూత పెన్షన్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వెంకట్రాములు, మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మానస, మున్సిపల్ కమిషనర్ రాజయ్య, వివిధ మండలాల ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరణకు తక్షణమే నిర్ణయం తీసుకోవాలి!

ఇంటర్మీడియట్ బోర్డు విలీనంపై ఉద్యోగులకు అభయం ఇవ్వాలి

- పీఆర్‌సీని 2023 నుంచే అమలు చేయాలి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించేందుకు తక్షణమే కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డును పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసే ప్రతిపాదన నేపథ్యంలో బోర్డులో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగుల ప్రయోజనాలకు భరోసా కల్పించాలని కోరారు. రెండవ వేతన సవరణ సంఘం (2వ పీఆర్‌సీ) సిఫార్సులను 2023, జూన్ 1 నుండి అమలు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్పు చేసే అంశంపై ఉద్యోగ సంఘాల నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపిందని ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ తెలిపారు. ఇదే అంశంపై సమగ్ర అధ్యయనం చేసి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకునేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నెలలు గడుస్తున్నా దీనిపై ఎలాంటి నిర్ణయం జరుగలేదన్నారు. సీపీఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించడం లేదని, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలన్నది ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. ఉద్యోగులకు సంబంధించిన ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వీటిలో న్యాయమైన డిమాండ్లు, ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించినవే ఉన్నాయని గుర్తు చేశారు. వీటిని తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో జేఏసీ పక్ష ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రభుత్వ పెద్దలను ఒప్పించే దిశగా భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్. రాములు, కె. హన్మంతరావు, బి.కృపాకర్‌రెడ్డి, బాణాల రామిరెడ్డి, డాక్టర్ జి.నిర్మల, ఎల్.దర్శన్ గౌడ్, షేక్ హబీబ్ మియా, గరికె ఉపేంద్రరావు, ఎస్వి సుబ్బయ్య, కె.మహి పాల్‌రెడ్డి, చి.రవి, ఎస్. నర్సింహులు, రొక్కం దేవిక, బి. సుదర్శన్ గౌడ్, ఎం. చంద్రశేఖర్ గౌడ్, కె.సాయిరెడ్డి (ఐఎన్‌టీయూసీ), పి. లక్ష్మయ్య, తొంట సత్యనారాయణ, ఆవుల సైదులు, శిరం దాసు రాందాస్, డాక్టర్ రామకృష్ణ, కె. సందీప్ కుమార్, మహ్మద్ మొయినుద్దీన్, ముకుందరెడ్డి మామిడి, ఎ. శ్రీకాంత్ గౌడ్, హేమలత, టి. జయప్రకాశ్, సుగంధిని, ఎస్. వివేక్, కుమార్ యారా, ఎం.డి. అజీజ్, రమేష్ పాక, ఫూల్ సింగ్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తికి గద్వాల కేంద్రం

- రైతుల ఆర్థికాభివృద్ధికి విత్తనోత్పత్తి ఉత్తమ మార్గం
- క్షేత్రస్థాయి అవగాహన సదస్సులో నాబార్డ్ ఏజీఎం మనోహర్ రెడ్డి



ఎర్రవల్లి , నవంబర్ 16(జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లాను నాణ్యమైన విత్తనోత్పత్తికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రైతులు ముందుకు రావాలని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎర్రవల్లి మండలం తిమ్మాపూర్ శివారులోని రైతు ఎన్. రామ్ రెడ్డి పొలంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి. అర్చన ఆధ్వర్యంలో నాబార్డ్ ప్రాజెక్టు కింద వరి విత్తనోత్పత్తిపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. నాబార్డ్, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ సమన్వయంతో విత్తనోత్పత్తిని విస్తరించి రైతులకు అదనపు ఆదాయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీల ద్వారా విత్తనోత్పత్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. జిల్లా సహకార అధికారి టైసన్ పాల్ మాట్లాడుతూ.. బ్రీడర్ విత్తనాల ప్రాముఖ్యతను, సహకార సంఘాల ద్వారా విత్తనోత్పత్తి చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విత్తనోత్పత్తితో స్థానికంగా నాణ్యమైన విత్తనాల లభ్యత పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధి శ్రీలత పేర్కొన్నారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులు మినుము విత్తనోత్పత్తికి ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని పుటందొడ్డి పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.గత ఖరీఫ్‌లో బ్రీడర్ విత్తనోత్పత్తి చేపట్టిన ప్రగతిశీల రైతు రామ్ రెడ్డిని డాక్టర్ పి. అర్చన అభినందించారు. మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ ప్రత్యామ్నాయ పంటలుగా పెసర, మినుము, జొన్న వంటి స్వల్పకాలిక పంటల సాగుపై సూచనలు చేశారు. ఏఈఓ నరేష్ వివిధ రకాల విత్తనాల మధ్య తేడాలు, విత్తన శుద్ధి, ధృవీకరణ విధానాలను వివరించారు. రాబోయే రబీలో 10 ఎకరాల్లో మినుము విత్తనోత్పత్తి చేపట్టనున్నట్లు రైతు రామ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా ఆగని సంక్షేమం

మంత్రి జూపల్లి



కొల్లాపూర్, నవంబర్ 16(జనంసాక్షి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పేదల సంక్షేమం, ప్రజల ఆత్మగౌరవమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలో నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంత్రి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, సన్నధాన్యానికి బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనేక సవాళ్లతో కూడుకున్నప్పటికీ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా 3,696 పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

రాజేంద్రనగర్,నవంబర్16(జనంసాక్షి) : కోకాపేటలో తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. 2024 ఆగస్టు 21న కోకాపేటలోని సన్‌షైన్ ఎకోపోలిస్ అపార్ట్‌మెంట్‌లో తొమ్మిదేళ్ల బాలిక తన చిలుక కోసం వెతుకుతుండగా, అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రనోజ్ టాయే (23) చిలుకను చూపిస్తానని నమ్మించి ఐదో అంతస్తులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి తల్లికి విషయం చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మరుసటి రోజు నిందితుడిని అరెస్టు చేశారు.విచారణ అనంతరం ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి టి. శ్రీనివాస్ నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసులో అప్పటి నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి దర్యాప్తు చేయగా, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ విష్ణువర్ధన్‌రెడ్డి, సీడీఓ కె. అంజిలప్ప, సమన్ల సిబ్బంది కె. నిరంజన్ గౌడ్ లు కేసు విచారణను ముందుకు తీసుకెళ్లారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నార్సింగి పోలీసులు అభినందించారు.

బస్టాండ్‌లో 'చైల్డ్ హెల్ప్ లైన్ 1098'



మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 16(జనం సాక్షి): ఆపదలో ఉన్న చిన్నారులకు తక్షణ రక్షణ, సహాయం అందించే లక్ష్యంతో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'చైల్డ్ హెల్ప్ లైన్ 1098' హెల్ప్ డెస్క్‌ను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బస్ స్టాండ్‌కు వచ్చే ప్రయాణికులలో తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు లేదా ఆపదలో ఉన్న చిన్నారులను గుర్తించి వారికి తక్షణమే భద్రత కల్పించడంలో ఈ హెల్ప్ డెస్క్ కీలక పాత్ర పోషించాలన్నారు. కేంద్రం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, సిబ్బంది పనివేళలకు సంబంధించిన విధుల పట్టికను (షిఫ్ట్ చార్ట్) స్పష్టంగా రూపొందించి అక్కడ ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి (డీడబ్ల్యూఓ)ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (సంతోష్ కుమార్) డిపార్ట్‌మెంట్ మేనేజర్, కృష్ణ మూర్తి అండ్ మాధవ రావు డిప్యూటీ ఆర్ఎం అశోక్ అసిస్టెంట్ డిపో మేనేజర్ రెండో పట్టణ ఎస్సై బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) సభ్యులు జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) డీసీపీయూ సిబ్బంది చైల్డ్ హెల్ప్ లైన్ సమన్వయకర్త మరియు సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు

- ఆచూకీ తెలపడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసులు
- కోదండపురం ఎస్సైపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు
- పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తాం : చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేవతి



గద్వాల నడిగడ్డ, నవంబర్ 16(సాక్షి జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా కోదండపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాసనూలు గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయినీ గత నెల 28న ట్రాప్ చేసి తీసుకువెళ్లారని వారిపై ఫిర్యాదు చేస్తే నేటి వరకు కోదండపురం పోలీసులు ఉలుకు పలుకు లేదని సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్థానిక ఎస్సై పై ఫిర్యాదు చేసినట్లు చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేవతి తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని సాసనూలు గ్రామానికి చెందిన కౌట్లయ్య, సువర్ణ కూతురు (17) మైనర్ అమ్మాయినీ, అదే గ్రామానికి చెందిన చిన్న గోకారి కుమారుడు ఎలీషా అనే వ్యక్తి గత నెల 28 అమ్మాయిని ట్రాప్ చేసి తీసుకెళ్లడము జరిగిందని, అందుకు సహకరించిన 5 గురు వ్యక్తుల పై ఫిర్యాదు చేయగా కోదశీడాపురం పోలీసులు స్టేషన్ లో ఖీఅతీ అశీ 118/2026 నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామనీ చెప్పి ఇంతవరకు ఎలాంటి విచారణ చర్యలు తీసుకోలేదనీ,పిర్యాదు చేసిన 14వ రోజులకి కోదండపురం ఎస్ఐ ఊర్లోకి రావడం జరిగిందనీ,ఈ సమస్య పట్ల ఇంతా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న ఎస్సై పై తగు విచారణ జరపాలని ,అమ్మాయి ఆచూకీ,వారి కుటుంబ సభ్యులకు తెలపాలని చైతన్య మహిళా సంఘం డిమాండ్ చేస్తుందనీ ,20 రోజులు కావస్తున్న ఇంతవరకు మైనర్ అమ్మాయి ఆచూకీ తెలియలేదనీ, పోలీసులు పదేపదే అమ్మాయి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడుతున్నారనీ,అబ్బాయి తల్లిదండ్రుల ను పిలవడం లేదనీ, 20 రోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో అమ్మాయి తల్లిదండ్రులు,తమ కూతురిని చంపేస్తారేమోనని భయపడుతున్నారనీ రేవతి తెలిపారు.ఈ విషయంపై సోమవారము ప్రజావాణిలో చైతన్య మహిళా సంఘం, అమ్మాయి తల్లిదండ్రు లు ఎస్పీ ని కలవగా రెండు రోజుల్లో ఎలిషాను అదుపులోకి తీసుకుంటామని హామీ ఇచ్చారనీ, ఎస్సై నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ, మైనర్ అమ్మాయి ఆచూకీ దొరకకపోతే కోదండాపురం పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తామని సి ఎం ఎస్ అధికారులకు విజ్ఞప్తి చేస్తుందనీ వారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేవతి,వెంకటమ్మ,కీర్తి, చైతన్య మహిళా సంఘం సభ్యులు, మైనర్ బాలిక తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో వైభవంగా కోటి దీపోత్సవం

- ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా



ముషీరాబాద్, నవంబర్ 16 (జనం సాక్షి): తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా కోటి దీపోత్సవం మూడో రోజు వేడుకలు హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. శంఖారావం, వేదపఠనంతో ప్రారంభమైన కార్యక్రమాల్లో మహాశివలింగానికి ప్రదోషకాల అభిషేకం నిర్వహించారు. పర్ణిక బృందం ఆలపించిన భక్తిగీతాలు, సప్తస్వరాలు బృందం వీణా నాదం భక్తులను అలరించాయి. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా వేదికపై శివపరివారానికి కోటి పుష్పార్చన నిర్వహించగా, ప్రాంగణంలో భక్తులు శివలింగాలకు పుష్పార్చన చేశారు. కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కాశీ జగద్గురు శ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి, శివయోగీశ్వర సాధు సంస్థానం మఠం డాక్టర్ శివానంద భారతి మహాస్వామి పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పెరుగు శ్రీసుధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం 108 మంది భక్తులతో బంగారు శివలింగం వద్ద పంచహారతులు నిర్వహించారు. పల్లకిపై కీసరగుట్ట ఉత్సవమూర్తుల ఊరేగింపు కనులపండువగా సాగింది. పీఠాధిపతుల అనుగ్రహభాషణం, ముఖ్య అతిథుల ప్రసంగాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పీఠాధిపతులు, అతిథులు, చైర్మన్ దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు సామూహిక కార్తిక దీపారాధనలో పాల్గొన్నారు. సప్తతి, మహానీరాజనం, గురువందనం, అతిథుల సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. మద్దాళి సౌందర్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, భావనదీప్తి బృందం ఫ్యూజన్ నృత్యం, అనన్యా రెడ్డి బృందం నృత్య ప్రదర్శన, పంబమేళా విన్యాసాలు, కోలాట కదంబం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహామంగళహారతితో కోటి దీపోత్సవం మూడో రోజు వేడుకలు భక్తిపారవశ్యంతో ముగిశాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370